Congratulations



8

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - బుధవారం 23 సెప్టెంబర్ 2026 ‖ సంపుటి: 10 ‖ సంచిక: 259 ‖ పేజీలు: 8+4 ‖ వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


ఎంత పాడాలన్నది పౌరుడి ఇష్టమే



2

### డ్రగ్స్ రహిత భారతావని నిర్మాణానికి రాష్ట్రాలు కూడా

## మిషన్ మోడ్‌లో పని చేయాలి





**కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా**

**అమరావతి, సెప్టెంబరు 22,మనం న్యూస్:** మాదకద్రవ్య రహిత భారతావని నిర్మాణానికి యువతను మాదక ద్రవ్యాల బారి నుండి కాపాడేందుకు కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా మిషన్ మోడ్ తో పని చేయాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు.న్యూ ఢిల్లీలోని భారత్ మండపంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఘ్రాఇఆ)ఆధ్వర్యంలో ఈనెల 22,23 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే 3వ జాతీయ యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్సు(ఆ్ఖీఊ) అధిపతుల సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు.ఏకీకృత సంకల్పం,ఉమ్మడి బాధ్యత్వ(ఎ్జ్ఞీ ఖ్రటౌజూర్ఛి,ఖీజ్చిట్ఛ ఖ్రఊౌఃజ్ఛీఃజ్ఞీజూజ్టీడఅనే ప్రధాన ఉద్దేశ్యంతో ఈరెండు రోజుల సదస్సు నిర్వహిస్తుండగా వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు,డిజిపిలు వర్చువల్ గా ఈసదస్సులో పాల్గొన్నారు.కేంద్ర మంత్రి అమితా

...మిగతా 2లో





# కుప్పంలో సీఎంకు నీరాజనం

### రైల్వే ఎక్స్‌ప్రెస్ హాల్ట్ ప్రారంభం

### హంద్రీ-నీవా కాలువకు జలహారతి

**కుప్పం, మనం ప్రత్యేక ప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు కుప్పం రైల్వే స్టేషన్లో దాదర్ పుదుచ్చేరి ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌ను ప్రారంభించడంతో పాటు శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద హంద్రీ-నీవా కాలువకు సీఎం జలహారతి సమర్పించారు. మంగళవారం ఉదయం సీఎం చంద్రబాబు కుప్పం రైల్వే స్టేషన్కు చేరుకుని, అక్కడ దాదర్-పుదుచ్చేరి ఎక్స్ప్రెస్ రైలు అదనపు హాల్టు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. సీఎం ప్రత్యేకంగా చేసిన విజ్ఞప్తి మేరకు రైల్వే బోర్డు ప్రయోగాత్మకంగా ఈ స్టాపింగ్ను

...మిగతా 2లో



### కానిస్టేబుళ్లే పోలీసు వ్యవస్థకు

## వెన్నెముక

### క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో విధులు నిర్వర్తించాలి: హోంమంత్రి అనిత

**అమరావతి, సెప్టెంబర్ 22,(మనం ప్రత్యేక ప్రతినిధి):** పోలీసు విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వం అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. తల్లిదండ్రుల త్యాగాలను ఎప్పటికీ గుర్తుంచుకుని ప్రజలకు సేవ చేయాలని నూతనంగా విధుల్లోకి అడుగుపెడుతున్న కానిస్టేబుళ్లకు సూచించారు. పోలీసు యూనిఫాం

...మిగతా 2లో

## బంగాళాఖాతంలో వాయుగుండం

### విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో హోంమంత్రి అనిత సమీక్ష



**అమరావతి, సెప్టెంబర్ 22,(మనం న్యూస్):** పశ్చిమమధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలోని వాయుగుండం నేపధ్యంలో రాష్ట్ర హోం,విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బంగాళాఖాతంలో నెలకొన్న పరిస్థితులను, వాయుగుండం కదలికలను ఆమె ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మత్స్యకారులు ఎట్టిపరిస్థితుల్లోనూ వేటకు

...మిగతా 2లో

## ధర్మవరం అభివృద్ధికి రూ.242.28 కోట్ల మహా ప్రణాళిక

**మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**

**అమరావతి, సెప్టెంబరు 22,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ధర్మవరం పట్టణ సమగ్ర అభివృద్ధికి వివిధ పథకాల కింద మొత్తం రూ.242.28 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను మెరుగుపరిచి పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.



**హెచ్ఏఎం కింద ధర్మవరానికి రూ.43 కోట్ల పనులు**

ధర్మవరం పురపాలక సంఘానికి హెచ్ఏఎం కింద రూ.43 కోట్ల విలువైన పనులు కేటాయించామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

ఈ నిధులతో రోడ్లు, డివైడర్లు, పార్కులు, వీధి దీపాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయని వెల్లడించారు.

### టీచర్లపై దాడులు వైకాపా అరాచక

## రాజకీయాలకు నిదర్శనం

### జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల



**పాలకొల్లు, సెప్టెంబర్ 23,మనం ప్రతినిధి:** రాష్ట్రంలో ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం వైకాపా అరాచక రాజకీయాలకు నిదర్శనమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విమర్శించారు. పాలకొల్లులో లైన్స్ కమిటీ హాల్ నందు మంగళవారం హమ్ ) నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్గా ప్రారంభించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విజయవాడలో ఉపాధ్యాయులపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులపై గంజాయి బ్యాచ్లు, బ్లేడ్ బ్యాచ్లతో దాడులు చేయించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను అవమానించడం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో అశాంతి, విధ్వంసం సృష్టించడమే లక్ష్యంగా వైకాపా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విజయవాడలో జరిగిన ఘటనలో ప్రకాశం జిల్లా, గుంటూరు,

...మిగతా 2లో

## గురువులపై దాడి.. గొడ్డలి పార్టీ దుర్మార్గానికి పరాకాష్ఠ

పాఠాలు చెప్పే ఉపాధ్యాయులపై చేయిచేసుకోవడం హేయం.. బాధ్యులను ఉపేక్షించేది లేదు

డీఎస్సీపై దుష్ప్రచారంతో అభ్యర్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే కుట్ర

చంద్రబాబు పాలనలో యువతకు ఉద్యోగ భరోసా..

లోకేశ్ చొరవతో విద్యారంగంలో సంస్కరణలు

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు



**అమరావతి, సెప్టెంబర్ 22(మనంన్యూస్):** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై ఆరోపణలు చేస్తూ విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద వైసీపీ చేపట్టిన ఆందోళన సందర్భంగా

...మిగతా 2లో

## కళాకారులు, సాంకేతిక నిపుణుల ప్రతిభకు నంది అవార్డులు

తెలుగు సినీ, టీవీ రంగానికి నంది అవార్డుల పునరుద్ధరణ

డిసెంబర్లోగా నంది అవార్డుల ప్రదానం

సినీ, టెలివిజన్ రంగానికి గౌరవం.. నంది అవార్డుల ప్రకటన

నంది అవార్డులపై ఎఫ్డీసీ చైర్మన్ పి. భరత్ భూషణ్ కీలక ప్రకటన



**విజయవాడ,సెప్టెంబర్,22,(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపిఎఫ్డిసి/ఏపియస్ఎఫ్టిటిడిసి) చైర్మన్ పి. భరత్ భూషణ్, ఎండీ కె. విశ్వనాథన్ లు నంది అవార్డులకు సంబంధించిన అంశాలపై సంయుక్తంగా పాత్రికేయుల సమావేశాన్ని శనివారం విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ మొదటి అంతస్తులోని ఏపీఎస్ఆర్టీసీ మెయిన్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్టేట్ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పి. భరత్

...మిగతా 2లో

### ట్రంప్‌పై అమెరికా మీడియా

## తిరుగుబాటు

### ఫూల్ కవరేజీ నిలిపివేత



**వాషింగ్టన్, సెప్టెంబర్ 22:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై అక్కడి టెలివిజన్ నెట్‌వర్క్‌లు తిరుగుబాటు ప్రకటించాయి. ట్రంప్ కార్యక్రమాల కవరేజీని ప్రధాన మీడియా సంస్థలు బహిష్కరించాయి. అధ్యక్ష

...మిగతా 2లో

## రూబీ ఇయర్ వేడుకలకు ఉపరాష్ట్రపతిని ఆహ్వానించిన డా. ఎన్టీఆర్ (ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వీసీ)



**ఢిల్లీ, విజయవాడ, సెప్టెంబర్ 22(మనం న్యూస్):** డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 40 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న రూబీ ఇయర్ (40వ వార్షికోత్సవ) వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ను ఆహ్వానించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. పి. చంద్రశేఖర్ మంగళవారం న్యూఢిల్లీలో భారత ఉపరాష్ట్రపతి వ్యక్తిగత కార్యదర్శి అమిత్ ఖరే, ఐఏఎస్ను మర్యాదపూర్వకంగా కలిసి

...మిగతా 2లో

### ఎలినినో ప్రభావంతో రైతులకు నష్టం జరగకుండా

## ప్రభుత్వం అన్ని విధాల అదుకుంటుంది

### జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి





**బాపట్ల,సెప్టెంబర్,22, (మనం ప్రతినిధి):** ఎలినినో ప్రభావంతో రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని న్యూ విసి హాల్ లో జరిగింది. ఎలినినో ప్రభావం చూపుతున్న వ్యవసాయశాఖ, వాటి అనుబంధ శాఖలు, పరిశ్రమలు, వాటి అనుబంధ శాఖలు, జల వనరులు ఇలా మొత్తంగా 14 శాఖలపై చర్చ సాగింది. మనుషులు, జీవాలకు తాగునీరు కొరవ లేకుండా చూడాలని ఇన్చార్జి మంత్రి స్పష్టం చేశారు. జీవాలకు పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు పూర్తిగా నింపాలి, జల వనరులు అందుబాటులో ఉన్న ప్రాంతాలలో బోర్ల ద్వారా నింపే ప్రయత్నం చేయాలన్నారు. పట్టిసీమ నుంచి 46.89 టీఎంసీల నీరు విడుదల చేయగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు ఎందుకు నింపలేదని ప్రశ్నించారు. ప్రతి ఏటా సెప్టెంబర్ నాటికి 20 టీఎంసీల నీరు జిల్లాకు విడుదల చేస్తుంటే... ప్రస్తుతం 9.85 టీఎంసీలు మాత్రమే విడుదల అయ్యిందన్నారు. దిగువకు నీరు

...మిగతా 2లో

# వైభవంగా శ్రీవారి రథోత్సవం

### భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తులు

### గోవిందనామస్మరణతో మారుమోగిన తిరుమాడ వీధులు



**తిరుమల, సెప్టెంబరు 22, మనం న్యూస్:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని రథాన్ని లాగి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్ప స్వామివారిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. స్వామివారు రథంపై విహరిస్తుండగా భక్తులు అడుగడుగునా హారతులు సమర్పిస్తూ, గోవిందా.. గోవిందా అంటూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

గోవిందనామస్మరణతో తిరుమాడ వీధులు మారుమోగాయి: ఆర్ష సంప్రదాయంలో రథోత్సవానికి విశిష్ట స్థానం

...మిగతా 2లో

### డ్రగ్స్ రహిత భారతావని నిర్మాణానికి రాష్ట్రాలు కూడా

# మిషన్ మోడ్‌లో పని చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈసదస్సు ప్రారంభోత్సవ ఉపన్యాసం చేస్తూ దేశాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు యువతను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం'మిషన్ మోడ్' లో పనిచేస్తోందని అందుకు అన్ని రాష్ట్రాలు,పాల్గొన్నారు మరిన్ని ప్రాంతాలు కూడా తగిన కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అలాగే 'విజన్ డాక్యుమెంట్ ఆన్ నార్కోటిక్స్ కంట్రోల్ (2026-29)' నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు.

దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ౹ాఇఅ, రాష్ట్రాల ఆ్ఖీఊల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ జాతీయ సదస్సు ప్రధాన ఉద్దేశాల్లో ఒకటని అమిషా పేర్కొన్నారు.రాష్ట్రస్థాయి అనుభవాలు,కేంద్ర దర్యాప్తు సంస్థల సమాచారాన్ని పరస్పరం పంచుకోవడం ద్వారా భవిష్యత్ చర్యలకు స్పష్టమైన దిశను రూపొందించేందుకు ఈ వేదిక ఉపయోగపడనుందని అన్నారు.మాదకద్రవ్యాల ప్రభావం యువతపై పడకుండా నిరోధించడం,అక్రమ రవాణా నెట్వర్క్లను అడ్డుకోవడం,దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచడం, కేంద్ర-రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయాన్ని వేగవంతం చేయడం వంటి అంశాలు ఈ సదస్సులో కీలకంగా నిలవనున్నాయని తెలిపారు.గతంలో చేపట్టిన చర్యలను సమీక్షించడంతో పాటు, రాబోయే సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా మరింత సమన్వయంతో ముందుకు వెళ్లే కార్యాచరణకు ఈ సమావేశం వేదిక కానుందని స్పష్టం చేశారు. ఈలక్ష్య సాధనలో ముఖ్యంగా మాదకద్రవ్యాల స్మగ్లర్లు,విక్రేతలపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వాలను మరియు పోలీసు బలగాలకు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.మాదక ద్రవ్యాల కేసుల్లో పట్టుబడిన నిందితుల ఆస్తులను ౹ఐఖీ-౹్ఖ చట్టం కింద జప్తు చేయాలని ప్రత్యేక కోర్టుల ద్వారా వేగంగా విచారణ జరిపించాలని కోరారు. డ్రగ్స్ నెట్వర్క్లను మరియు అంతర్జాతీయ కార్టెల్లను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా మాదకద్రవ్యాలకు బానిసలైన వారిని (డ్రగ్ అడిక్ట్స్) నేరస్థులుగా కాకుండా బాధితులుగా పరిగణించి మానవీయ దృక్పథంతో చూడాలని అమిత్ షా సూచించారు.అలాంటి వారు తిరిగి సమాజంలో సాధారణ జీవితాన్ని గడిపేలా పునరావాస చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు.డార్క్ నెట్,క్రిప్టో ఇన్వెస్టిగేషన్స్,సింథటిక్ డ్రగ్స్ నియంత్రణ వంటి సాంకేతిక అంశాలను కూడా ఈ సమావేశంలో చర్చించారు.

# కుప్పంలో సీఎంకు నీరాజనం



(మొదటి పేజీ తరువాయి)

మంజూరు చేసింది. అనంతరం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి గ్రామానికి చేరుకున్న సీఎం, అక్కడ పారే హంద్రీ-నీవా కాలువకు ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. కృష్ణా జలాలు తమ ప్రాంతానికి రావడం పట్ల స్థానిక రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం: జలహారతి అనంతరం సీఎం చంద్రబాబు అక్కడ నిర్మించిన హెచ్ఏఎం ప్రాజెక్టులను, ఈసీ పౌల్ట్రీ షెడ్లను అధికారికంగా ప్రారంభించారు. నియోజకవర్గంలో పౌల్ట్రీ రైతుల అభివృద్ధికి, ఆర్థిక వృద్ధికి ఇవి దోహదపడతాయని సీఎం పేర్కొన్నారు. పర్యటన ముగింపులో స్థానిక పౌల్ట్రీ రైతులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ నేతలు , కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించి నియోజకవర్గ అభివృద్ధిపై దిశానిర్దేశం చేశారు. సాయంత్రం 4:40 గంటలకు తుమ్మిసి హెలీప్యాడ్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో సీఎం బెంగళూరు మీదుగా విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యారు.

## కానిస్టేబుళ్లే పోలీసు వ్యవస్థకు వెన్నెముక

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల్లో భయాన్ని కాకుండా భరోసాను కల్పించేలా ఉండాలని అన్నారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ బీటీసీ పరేడ్ గ్రౌండ్స్లో మంగళవారం 2025-26 బ్యాచ్కు చెందిన 149 మంది స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి అనిత శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రాష్ట్రంలో కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియను ఎన్నో అడ్డంకులను అధిగమించి పూర్తి చేశామని తెలిపారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్ల స్టైపెండ్ను రూ.4,500 నుంచి రూ.12,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 శిక్షణ కేంద్రాల్లో 5,800 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తయిందని తెలిపారు. వీరిలో 2,330 మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారని వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో సుమారు 1,000 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉండటం విశేషమన్నారు.

**ప్రజలకు పోలీసులంటే భరోసా కలగాలి**

పోలీసు వ్యవస్థకు కానిస్టేబుళ్లే వెన్నెముక అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. విపత్తులు, బందోబస్తు, అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక నైపుణ్యాలు కలిగిన కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ అందించామని తెలిపారు.పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, వారికి సత్వర న్యాయం అందించేలా పనిచేయాలని సూచించారు. పోలీసులంటే ప్రజల్లో భయం కాకుండా భరోసా కలిగేలా వ్యవహరించాలన్నారు.

## ఎలినినో ప్రభావంతో రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని విధాల అదుకుంటుంది

(మొదటి పేజీ తరువాయి)

రాని ప్రాంతాలలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పంటలు వేసిన రైతులను ఇబ్బందుల పెట్టొద్దు, కొత్తగా వరి, పొగాకు పంటల సాగు తాత్కాలికంగా నిలిపివేయాలని ఇన్చార్జి మంత్రి సూచించారు. ఎలినినో ప్రభావం అధికంగా ఉందనే విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ... రైతులను అప్రమత్తం చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో నిత్యం పర్యటించాలని, ఇప్పటినుంచి పంటలు వేయకుండా చూడాలన్నారు. ఇప్పటికే పంటలు వేసి ఉంటే వారి పంటలను కాపాడుకోవడానికి యూరియా అదనంగా ఒక బ్యాగ్ ఇచ్చే అంశంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. 100శాతం రాయితీపై ఇచ్చే పామాయిల్ విత్తనాలతో లాభసాటిగా సాగు ఉందన్నారు. వాటి వైపు రైతులు మొగ్గు చూపేలా అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎలినినో ప్రభావం చూపుతున్న ప్రాంతాలలో పిఎండిఎస్ ఇట్లు. వర్షాకాలానికి ముందు పొడి నేలలో విత్తనాలు విత్తే విధానం అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకొరకు ప్రభుత్వం 39,862 కిట్లను బాపట్ల జిల్లాకు ప్రభుత్వం పంపిణీ చేయగా పూర్తిస్థాయిలో ఎందుకు వినియోగించ లేదని అధికారులను ప్రశ్నించారు. వర్షాలపై ఆధారం లేని ప్రాంతాలలో పంటల సాగుకు ఈ విధానాన్ని అమలు చేయాలన్నారు.

ఆక్వా రంగంపై ఎలినినో ప్రభావం ఎలా ఉంది. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు. పరిశ్రమలు పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించగా, బాపట్ల జిల్లాకు పెట్టుబడుదారులు ఎందుకు రావడం లేదని సంబంధిత అధికారులను నిలదీశారు. పరిశ్రమలు, ఏపిఐఐసి అధికారులు ఆశాజనకంగా పనిచేయడం లేదన్నారు. కొత్తగా పరిశ్రమలు రాకపోతే ఉత్పత్తి రాదు, ఉపాధి అవకాశాలు ఉండవు ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని, సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రస్తుతం రైతులు సాగుచేసిన పంటలను కాపాడుకోవడానికి ఎంత నీరు కావాలి అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. జల వనరుల లభ్యత, అవసరతపై స్పష్టంగా పొందుపరిచి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. 60 రోజుల పాటు నీరు విడుదలైతే జల వనరులశాఖ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పర్యవేక్షణ లోపంతోనే తాగునీటి చెరువులు పూర్తిగా నిండా లేదన్నారు. దిగువకు రాకుండానే నీటి చౌర్యం జరుగుతుంటే పట్టించుకోలేదన్నారు. అవసరమైతే పోలీసులు సహకారం తీసుకోవాలని, పోలీసుల భద్రతతో ట్యాంకులు నిండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మనుషులు, జీవాలకు తాగునీరు సమస్య రాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలినినో ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికతో చర్యలు తీసుకుంటుందన్నారు. అదే క్రమంలో జిల్లా యంత్రాంగం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. పంటలు వేయకుండానే గడువు ముగుస్తుందంటూ రైతులు బీమా సొమ్ము కట్టారని, సాగు చేయలేకపోయిన రైతులకు ఆ డబ్బులు తిరిగి ఇప్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వానికి వీటిపై స్పష్టంగా నివేదిక పంపాలని కోరారు.

## గురువులపై దాడి.. గొడ్డలి పార్టీ దుర్మార్గానికి పరాకాష్ఠ



(మొదటి పేజీ తరువాయి)

చోటుచేసుకున్న ఉద్రిక్తతపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఉపాధ్యాయులు అంటే గౌరవం లేని గొడ్డలి పార్టీ నేతలు.. ఉద్యోగాలు సాధించిన టీచర్లను అవమానించడమే కాకుండా దాడులకు దిగడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పల్లా ధ్వజమెత్తారు. క్రీడల్లో ప్రతిభ చాటి, పతకాలు సాధించి, కష్టపడి చదివి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిపై అనుమానాలు రేకెత్తించడం సరికాదన్నారు. తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలు, పతకాలు నిజమైనవేనని స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు వెల్లడించిన నేపథ్యంలోనూ రాజకీయ రాద్ధాంతం చేయడం దేనికని ప్రశ్నించారు.

**గురువులను గౌరవించడం మన సంస్కారం**

ఉపాధ్యాయ వృత్తి సాధారణ ఉద్యోగం కాదని పల్లా అన్నారు. ఒక ఉపాధ్యాయుడి వెనుక ఎన్నో సంవత్సరాల కఠోర శ్రమ, చదువు, పోటీ, కుటుంబం ఆశలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడమే కాకుండా వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మార్గదర్శకులుగా గురువులు నిలుస్తారని చెప్పారు. అలాంటి ఉపాధ్యాయులను రోడ్లపైకి లాగి అవమానించడం, దాడులకు పాల్పడటం వైసీపీ రాజకీయ సంస్కృతికి అద్దం పడుతోందని విమర్శించారు.

# బంగాళాఖాతంలో వాయుగుండం

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లరాదని, తమ బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాల్లో జాగ్రత్త పరుచుకోవాలని కోరారు.

విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వాయుగుండం తీవ్రతను హోంమంత్రికి వివరిస్తూ, ఇది ప్రస్తుతం గోపాల్పూర్ (ఒడిశా)కు 180 కిమీ, కళింగపట్నానికి 180 కిమీ, విశాఖపట్నానికి 270 కిమీ దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపారు. ఈ వాయుగుండం రేపు రాత్రి లేదా ఎల్లుండి తెల్లవారుజాము సమయంలో విశాఖపట్నం - గోపాల్పూర్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. వాయుగుండం ప్రభావంతో రేపు, ఎల్లుండి కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత సూచించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, రానున్న మూడు రోజులు అత్యంత కీలకమైనందున ప్రభావిత జిల్లాల యంత్రాంగం హై అలెర్ట్లో ఉండాలని ఆదేశించారు.

# వైభవంగా శ్రీవారి రథోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

అనాదికాలం నుంచి రాజులకు రథసంచారం ప్రసిద్ధమైంది. యుద్ధాల్లోనూ రథాలను విరివిగా ఉపయోగించినట్లు భారతాది ఇతిహాసాలు, పురాణాలు వివరిస్తున్నాయి. శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తాడని ఆర్ష గ్రంథాలు పేర్కొంటున్నాయి.

ప్రసిద్ధ దేవాలయాల్లో ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేసి ఊరేగించే సంప్రదాయం ఆగమశాస్త్ర సమ్మతంగా కొనసాగుతోంది.రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతేతిరుమల శ్రీవారి రథోత్సవం విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే అనే ఆర్షవాక్యం రథంపై కొలువుదీరిన శ్రీకేశవుని దర్శనం పరమపవిత్రమైనదని తెలియజేస్తోంది. భక్తులు రథానికి కట్టిన తాళ్లను పట్టుకుని స్వామివారి రథాన్ని ముందుకు లాగుతూ భక్తి పరవశ్యంలో మునిగిపోయారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రథోత్సవం సురక్షితంగా జరిగేలా టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

**రథోత్సవంలో అంతర్లీనమైన ఆత్మతత్త్వం**

రథోత్సవానికి విశిష్టమైన తాత్త్విక సందేశం కూడా ఉంది. కఠోపనిషత్తులో ఆత్మను రథికుడిగా, శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా, మనస్సును పగ్గాలుగా, ఇంద్రియాలను గుర్రాలుగా అభివర్ణించారు. ఇంద్రియాలకు విషయాలే మార్గాలుగా పేర్కొంటూ ఆత్మ-అనాత్మ వివేకాన్ని ఉపదేశించింది. రథోత్సవం భక్తులకు ఈ ఆధ్యాత్మిక తత్త్వాన్ని గుర్తుచేస్తుంది. భక్తులు రథాన్ని లాగుతున్నప్పటికీ, సకల జీవుల్లో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తన భక్తులను అనుగ్రహిస్తూ తన రథాన్ని తానే నడిపిస్తున్నాడనే భావన ఈ ఉత్సవంలో అంతర్లీనంగా ఉంది.ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్స్వామి, టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో డా. ఎ. శరత్, ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులు, సాంకేతిక నిపుణుల ప్రతిభకు నంది అవార్డులు

(మొదటి పేజీ తరువాయి)

భూషణ్ మాట్లాడుతూ... గతంలో ప్రకటించిన 2012 నుంచి 2016 వరకు నంది ఫిల్మ్ మరియు టీవీ అవార్డులను అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని నిలబెట్టేందుకు చర్యలు చేపడుతోందన్నారు.అదే విధంగా 2017 నుంచి 2024 వరకు సంవత్సరానికి 4 అవార్డుల చొప్పున (2 ప్రొడక్షన్, 2 స్పెషల్ జ్యూరీ) ఫిల్మ్ అండ్ టీవీ అవార్డులను అందించేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. 2025 సంవత్సరానికి నంది ఫిల్మ్ మరియు టీవీ అవార్డులను కూడా అందించనున్నట్లు నిర్ణయించారన్నారు. నంది ఫిల్మ్ మరియు జాతీయ చలనచిత్ర (నేషనల్ ఫిల్మ్) అవార్డులను అమరావతి లేదా విజయవాడ వేదికగా అందించాలని నిర్ణయించారన్నారు. నంది టీవీ అవార్డులను తిరుపతి వేదికగా అందించాలని నిర్ణయించారన్నారు. ఈ అవార్డులన్నింటినీ డిసెంబర్ 2026 లోగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## ఎంత పాడాలన్నది పౌరుడి ఇష్టమే

- వందేమాతరంపై సుప్రీం వ్యాఖ్య



**ఢిల్లీ, సెప్టెంబర్ 22:** వందేమాతరంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుల వ్యక్తిగత నిర్ణయమని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలు ఆలపించాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఆరు చరణాలను తప్పనిసరి చేయడంపై ప్రముఖ సంగీత విద్వాంసుడు టి.ఎం.కృష్ణ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. వందేమాతరంలోని చివరి నాలుగు చరణాల్లో హిందూ దేవతలను ఉద్దేశించిన అంశాలు ఉన్నాయని, వాటిని తప్పనిసరిగా పాడేలా చేయడం రాజ్యాంగంలోని లౌకిక విలువలకు విరుద్ధమని పిటిషన్లో పేర్కొన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేలా, ఒక నిర్దిష్ట మతపరమైన సందేశాన్ని ప్రోత్సహించేలా చట్ట సవరణ ఉందని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. ఈ పిటిషన్ పై తాజాగా విచారణ జరిగింది. పూర్తి చరణాలు పాడని వారిపై చర్యలు తీసుకోలేరని ఈ సందర్భంగా సీజేఐ ధర్మాసనం స్పష్టం చేసింది. పూర్తి వందేమాతరం పాడని వారిపై కేంద్రం తీసుకునే చర్యల అంశాన్ని పరిశీలించేందుకు అంగీకరించింది. వందేమాతరం సవరణ చట్టం, మార్గదర్శకాలపై రెండు వారాల్లోగా సమాధానం చెప్పాలని కేంద్రానికి నోటీసులు ఇచ్చింది.

## ట్రంప్‌పై అమెరికా మీడియా తిరుగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

భవనం వైట్‌హౌస్‌లోకి ప్రవేశించకుండా మూడు ముఖ్య మీడియా సంస్థలను నిషేధిస్తూ ఆయన తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ అసాధారణ నిరసన చేపట్టాయి. సీఎన్ఎన్, ఎంఎస్ నౌ,పొలిటికో (డిజిటల్/ప్రింట్ మీడియా) మీడియా సంస్థల రిపోర్టింగ్‌పై అభ్యంతరం వ్యక్తంచేస్తూ వాటి ప్రతినిధులు వైట్‌హౌస్‌లోకి ప్రవేశించకుండా ఇటీవల ట్రంప్ నిషేధించారు. ఈ ఆదేశాన్ని తక్షణమే ఎత్తివేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఆ మూడు సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయించాయి. టెలివిజన్ నెట్‌వర్క్‌లోని ఇతర సంస్థలు కూడా ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. సీఎన్ఎన్‌కు సంఘీభావంగా నిలిచాయి. అలాగే వైట్‌హౌస్‌లో 'పూల్' కవరేజీని నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. సోమవారం వైట్‌హౌస్‌లో పూల్ కవరేజీకి సీఎన్ఎన్ వెళ్లాల్సి ఉంది. ''ప్రభుత్వం నుంచి కచ్చితమైన సమాచారాన్ని పొందేందుకు ప్రజలు ఆసక్తితో ఉంటారు. దానిని అందించే ఒక వార్తాసంస్థ రిపోర్టింగ్ పట్ల అభ్యంతరం ఉందని ఏ ప్రభుత్వం కూడా దాని కవరేజీని అడ్డుపడకూడదు'' అని మీడియా సంస్థలు తమ ప్రకటనలో పేర్కొన్నాయి. పూల్ టీవీ కవరేజ్ అంటే.. ఒక ముఖ్యమైన కార్యక్రమాన్ని ప్రసారం చేయడానికి అన్ని మీడియా సంస్థల తరఫున ఒక బ్రాడ్‌కాస్టర్ వెళ్లి కవర్ చేస్తుంటారు. సాధారణంగా వైట్‌హౌస్ ఈవెంట్లు, కోర్టు విచారణలు లేక విదేశీ పర్యటనల వంటి చోట్ల స్థలం కొరత, భద్రతా కారణాల వల్ల వందలాది టీవీ ఛానళ్ల కెమెరాలను ఒకేసారి అనుమతించడం సాధ్యం కాదు. అలాంటప్పుడు ఈ విధానాన్ని ఉపయోగిస్తారు. రొటేషన్ పద్ధతిలో ఒక్కోసారి ఒక్కో కెమెరా బృందం ఆ కార్యక్రమానికి హాజరవుతుంటుంది. వైట్‌హౌస్‌లో తాజాగా ట్రంప్ ఒక కొత్త హెలిపాడ్‌ను ప్రారంభించారు. మీడియా సంస్థల తిరుగుబాటుతో.. ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడిన మాటలు వినిపించకపోవడం గమనార్హం. అలాగే, న్యూయార్క్ నగరంలో ఐరాస సర్వసభ్య సమావేశంలో భాగంగా ట్రంప్ పలువురు విదేశీ నాయకులతో సమావేశం కానున్నారు. ఆ భేటీలపై టెలివిజన్ ప్రసారాన్ని మీడియా సంస్థలు బాయ్‌కాట్ చేశాయి.




**బాయ్‌కాట్‌కు ట్రంప్ కౌంటర్..**

మీడియా సంస్థలు తనను నిషేధిస్తే.. ట్రంప్ వారికి తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. వెంటనే శ్వేతసౌధం ట్రంప్ టీవీని ప్రారంభించింది. 24/7 అందుబాటులో ఉండే స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ను లైవ్‌లోకి తీసుకువచ్చింది. అలాగే మూడు మీడియా సంస్థలను నిషేధించడంపై ట్రంప్ స్పందించారు. ''మీడియా సంస్థలు నిష్పక్షపాతంగా ఉండాల్సిన బాధ్యత ఉందని నేను భావిస్తున్నాను. ఒకవేళ అవి ప్రచురించేవి నకిలీ వార్తలైతే.. వాటిని అనుమతించకూడదని నేను విశ్వసిస్తున్నాను'' అని వ్యాఖ్యానించారు. గతంలో కూడా ట్రంప్‌ను సోషల్ మీడియా సంస్థలు బహిష్కరిస్తే.. ఆయనే సొంతంగా ట్రూత్ సోషల్‌ను ప్రారంభించారు. తాజాగా టీవీ ఛానళ్ల విషయంలో కూడా ఇదే వ్యూహం పాటించారు.

## రూబీ ఇయర్ వేడుకలకు ఉపరాష్ట్రపతిని ఆహ్వానించిన డా. ఎన్టీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డా. పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నాలుగు దశాబ్దాలుగా వైద్య విద్య, ఆరోగ్య సేవలు, పరిశోధన రంగాల్లో విశేష సేవలు అందిస్తూ రాష్ట్రంలో వైద్య విద్యాభివృద్ధికి కీలకంగా పనిచేస్తోందని వివరించారు.

విశ్వవిద్యాలయం 40 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 2026 అక్టోబర్ 1న విజయవాడలో రూబీ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు గౌరవ ఉపరాష్ట్రపతిని ఆహ్వానిస్తూ రూపొందించిన ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని శ్రీ అమిత్ ఖరేకు అందజేశారు.

సుమారు నాలుగు దశాబ్దాలుగా విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతి, వైద్య విద్యలో తీసుకొచ్చిన మార్పులు, విద్యార్థులు-అధ్యాపకులకు అందిస్తున్న అవకాశాలు, ఆరోగ్య రంగానికి అందిస్తున్న సేవలు, పరిశోధనలో చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వీసీ వివరించారు.

రూబీ ఇయర్ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు కొనసాగుతున్నాయని డా. పి. చంద్రశేఖర్ తెలిపారు.

## ట్రంప్ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం

- మాజీ అధికారి విమర్శలు

**వాషింగ్టన్, సెప్టెంబర్ 22:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోన్న భారత్‌పై 100 శాతం సుంకం విధిస్తామని హెచ్చరిస్తున్న అమెరికా.. రష్యా మిత్రదేశమైన బెలారస్ నుంచి పొటాష్ కొనుగోలు ఒప్పందానికి ప్రయత్నిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ మాజీ అధికారి ఇవాన్ ఫైగెన్‌బామ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ''రష్యాతో సన్నిహిత సంబంధాలు కలిగిన బెలారస్‌తో భారీ పొటాష్ డీల్‌కు ప్రయత్నిస్తున్న యూఎస్.. ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తోన్న భారత్‌పై సుంకం విధిస్తామని బెదిరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. ఉక్రెయిన్ యుద్ధానికి భారత్‌ను బాధ్యులుగా చిత్రీకరించడం సరికాదు. రష్యా చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయాలని అమెరికా ఒత్తిడి చేయడం భారత విదేశాంగ విధానంలో జోక్యం చేసుకోవడమే. మాస్కోను యుద్ధం ఆపేలా చేయడంలో పాశ్చాత్య దేశాలు, ట్రంప్ విఫలమైనందుకు భారత్‌ను నిందించడం సరికాదు. ఇరు దేశాల సంబంధాలపై ఇలాంటి వైఖరి ప్రతికూల ప్రభావం చూపుతుంది. భారత్‌ను చైనాతో కలిపి చూడటం యూఎస్‌కు మేలు చేయదు'' అని పేర్కొన్నారు.బెలారస్ నుంచి భారీగా పొటాష్ కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకోనున్నట్లు ట్రంప్ సోమవారం ప్రకటించారు. ప్రస్తుతం కెనడా నుంచి కొనుగోలు చేస్తున్న దానికంటే తక్కువ ధరకు లభిస్తుందని తెలిపారు. అమెరికా పొటాష్ దిగుమతుల్లో కెనడా వాటా 2024లో 79 శాతంగా ఉంది. రష్యా నుంచి 11 శాతం, బెలారస్ నుంచి 4 శాతం దిగుమతులు జరిగాయని అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. మరోవైపు రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తుండటంతో భారత్‌పై అమెరికా కొత్త చట్టం ప్రభావం పడే అవకాశం ఉంది.

## టీచర్లపై దాడులు వైకాపా అరాచక రాజకీయాలకు నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)



విజయవాడ ఇతర ప్రాంతాల నుంచి రౌడీ మూకలను తీసుకువచ్చి ఉపాధ్యాయులపై దాడులు చేయించడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని మంత్రి పేర్కొన్నారు. దేశానికి సైనికుడిగా సేవలందించి అనంతరం ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన వ్యక్తి కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం బాధాకరమన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చి నిబంధనల ప్రకారం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఫేక్ అంటూ అవమానించడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు.

మెగా డీఎస్సీ నియామకాలపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని, గ్రూప్-1 పరీక్షల అక్రమాల అంశం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే జగన్ ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నియామక ప్రక్రియలు చేపడుతోందన్నారు.

# కుప్పం నియోజకవర్గంలోని ప్రతి చెరువుకూ నీరందిస్తాం

- హంద్రీ-నీవా సుజల స్రవంతి నుండి కుప్పం బ్రాంచి కెనాల్‌కు చేరిన కృష్ణాజలాలకు జల హారతి
- ముఖ్యమంత్రి చంద్రబాబు



**కుప్పం సెప్టెంబర్ 22 మనం న్యూస్:** కుప్పం నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా హంద్రీ-నీవా సుజల స్రవంతి రెండో దశలో కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా కృష్ణాజలాలను మరింత విస్తృతంగా వినియోగించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మంగళవారం శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్కు కృష్ణాజలాలు చేరిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జలహారతి ఇచ్చి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కృష్ణమ్మకు పసుపు కుంకుమ పూలు సరే సమర్పించి కొబ్బరికాయకొట్టి కుప్పం ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కుప్పం ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కృష్ణాజలాల రాకతో సాగు, తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడిందని ఆయన తెలిపారు. కుప్పం అభివృద్ధిలో నీటి వనరుల పెంపునకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, నీరు అందుబాటులో ఉంటే వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతాయని సీఎం వివరించారు.

గత ఏడాది కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా కృష్ణాజలాలను తీసుకువచ్చి 133 చెరువులను నింపగలిగామని, ఇప్పుడు నియోజకవర్గంలోని సాధ్యమైన ప్రతి చిన్న నీటివనరును కృష్ణాజలాలతో నింపి కుప్పాన్ని మరింత సస్యశ్యామలం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ పుంగనూరు బ్రాంచి కెనాల్లో 207.800 కిలోమీటర్ వద్ద ప్రారంభమై 131.200 కిలోమీటర్ల మేర కొనసాగుతూ కుప్పం సమీపంలోని పరమసముద్రం చెరువు వద్ద ముగుస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఎత్తిపోతలతో పాటు గురుత్వాకర్షణ ఆధారంగా పనిచేసే ఈ కాలువలో మూడు ఎత్తిపోతల కేంద్రాలు ఉన్నాయని, కాలువ ద్వారా నీటిని తరలించేందుకు 48 నీటి విడుదల మార్గాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.కుప్పం బ్రాంచి కెనాల్ను తొలుత పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 110 చిన్న నీటిపారుదల చెరువులకు నీరందించడంతో పాటు 6,300 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే విధంగా రూపొందించినట్లు సీఎం తెలిపారు. కాలువలోని ప్రారంభ భాగంలో 216 క్యూసెక్కులు, మూడో ఎత్తిపోతల కేంద్రం తర్వాత చివరి వరకు 161 క్యూసెక్కుల నీటిని తరలించే సామర్థ్యం ఉందన్నారు.2025-26 నీటి నియంత్రణ సంవత్సరంలో ఆగస్టు 21న పుంగనూరు బ్రాంచి కెనాల్ నుంచి కుప్పం బ్రాంచి కెనాల్లోకి నీరు చేరిందని, ఆగస్టు 25న 131.200 కిలోమీటర్ల దూరంలోని పరమసముద్రం చెరువు వరకు కృష్ణాజలాలు చేరాయని ముఖ్యమంత్రి తెలిపారు. గత వాటర్ సీజన్లో లక్ష్యంగా నిర్దేశించిన 110 చెరువులకు మించి 133 చెరువులను పూర్తిగా నింపి 759.21 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని అందించామని, దీనివల్ల 6,965 ఎకరాల ఆయకట్టు ప్రయోజనం పొందిందని వివరించారు. మరో 29 చిన్న నీటిపారుదల చెరువులకు 46.15 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని పాక్షికంగా అందించినట్లు తెలిపారు.

చెరువులు నిండడంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం గణనీయంగా మెరుగుపడిందని, దాని ఫలితంగా సాగు కార్యకలాపాలు కూడా పెరిగాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలోని రైతులకు నీటి భద్రత కల్పించడంతో పాటు గ్రామాల తాగునీటి అవసరాలను కూడా తీర్చేలా హంద్రీ-నీవా నీటిని సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.కుప్పం నియోజకవర్గంలోని సాధ్యమైన అన్ని చిన్న నీటిపారుదల చెరువులను కుప్పం బ్రాంచి కెనాల్ నీటితో నింపాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం నాలుగు మండలాల్లో అధికారులు సమగ్ర సర్వే నిర్వహించారని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో సర్వే పూర్తయిందని, కుప్పం నియోజకవర్గానికి సంబంధించిన సమగ్ర వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక కూడా సిద్ధమైందని వివరించారు.

మొత్తం రూ.439.640 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రణాళిక ద్వారా నాలుగు మండలాల్లో 418 చిన్న నీటిపారుదల చెరువులకు కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా నీటిని అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

గుడుపల్లె మండలంలో 96 చెరువులకు రూ.207.140 కోట్లతో నీరందించే పనులతో పాటు పారిశ్రామిక ప్రాంత అవసరాల కోసం 200 మిలియన్ క్యూబిక్ అడుగుల నిల్వ సామర్థ్యంతో కలివానక రిజర్వాయర్ను ప్రతిపాదించినట్లు చెప్పారు.రామకుప్పం మండలంలో 128 చెరువులకు రూ.101.830 కోట్లతో, శాంతిపురం మండలంలో 87 చెరువులకు రూ.78 కోట్లతో, కుప్పం మండలంలో 107 చెరువులకు రూ.63.570 కోట్లతో నీరందించేలా ప్రణాళిక రూపొందించినట్లు ముఖ్యమంత్రి వివరించారు.కుప్పం నియోజకవర్గాన్ని కేవలం ఒక నియోజకవర్గంగా కాకుండా సమగ్రంగా అభివృద్ధి చెందిన ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. నీటి వనరుల అభివృద్ధి, వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను సమాంతరంగా అభివృద్ధి చేస్తూ కుప్పాన్ని మరింత ముందుకు తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కృష్ణాజలాలు కుప్పం నేలను తడపడం ద్వారా రైతులకు భరోసా, గ్రామాలకు తాగునీటి భద్రత, భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని సీఎం అన్నారు.ఈ సందర్భంగా గుండిశెట్టిపల్లె కేబిసి వద్దా పండుగ వాతావరణం సంతరించుకుంది. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చే కార్యక్రమాన్ని తిలకించేందుకు కుప్పం నియోజకవర్గ ప్రజలు, రథులు, మహిళలు అశేషంగా తరలివచ్చారు. గ్రామీణ సాంస్కృతిక కార్యక్రమాలతో.. ఆ ప్రాంతంలో ఉత్సవ వాతావరణం నెలకొంది.ఆ

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, శాసనమండలి సభ్యులు డా. కంచర్ల శ్రీకాంత్, డా. వి.ఎం. థామస్, చిత్తూరు పార్లమెంటు సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాదరావు, శాసనమండలి సభ్యులు కృష్ణ రాఘవ జయేంద్ర భరత్, పెద్దిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, డా. సిసానిపాయి సుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ చైర్పర్సన్ జి. శ్రీనివాసులు, కుప్పం మున్సిపల్ చైర్మన్ వి. పిల్లారాత్, కుప్పం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు తదితర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

అలాగే చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్కుమార్, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తిరుభూషణ్కుమార్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, జలవనరుల శాఖ సీఈ ఎం.ఎల్.ఎస్. వీరప్రసాద్, ఎస్.సి. విఠల్ ప్రసాద్, ఎస్.సి. మురళీకుమార్ లతో పాటు ఇతర అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

# తిరుపతిలో 6వ ఎంఎస్ఎంఈ వర్క్షాప్ నిర్వహణ

- వన్ ఫ్యామిలీ – వన్ ఎంట్రప్రెన్యూర్‌తో ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త
- మహిళా పారిశ్రామికవేత్తల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం
- మహిళా సాధికారతకు 'లఖ్పతి దీదీ'తో కొత్త అవకాశాలు: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వేంకటేశ్వర్



**తిరుపతి, సెప్టెంబర్ 22 మనం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికరంగ అభివృద్ధితో పాటు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి ఆర్థికంగా స్వావలంబన చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ వర్క్షాప్లను నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వేంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి కచ్చాపి ఆడిటోరియంలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ వర్క్ షాప్ కు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో జిఎం డిఐసి చంద్రశేఖర్, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, ఇతర సంబంధిత అధికారులు, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ విజయభరత్ రెడ్డి, మెప్మా పిడి, వివిధ ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంతో ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడం పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. మహిళా సంఘాల ద్వారా 'లఖ్పతి దీదీ' వంటి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తూ, ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న మహిళలను రోల్ మోడల్స్గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఐదు ఎంఎస్ఎంఈ వర్క్ షాప్ లు నిర్వహించగా తిరుపతిలో 6వ ఎంఎస్ఎంఈ వర్క్ షాప్ నిర్వహించుకుంటున్నామన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే వెనుకబడి ఉందని, కేవలం ప్రభుత్వ ఉద్యోగాల పై ఆధారపడకుండా ఎంఎస్ఎంఈ రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచుకోవచ్చని పేర్కొన్నారు. దేశంలో విస్తృత స్థాయిలో ఉపాధి, ఆదాయ అవకాశాలను కల్పించే సామర్థ్యం ఎంఎస్ఎంఈ రంగానికి ఉందని తెలిపారు. తిరుపతి జిల్లాలో శ్రీసిటీ, అపోలో టైర్స్, హీరో మోటార్స్, మాంబట్టు సెజ్, నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్క్, మేనకూరు సెజ్, రౌతుసూరమాల స్పేస్ సిటీ, ఈఎంసీ తదితర పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామిక పార్కులు ఉన్నాయని తెలిపారు. శ్రీసిటీలోనే 70,000 మందికి పైగా ఉపాధి పొందుతున్నారని, వారిలో సుమారు 32,000 మంది మహిళలు ఉన్నారని వెల్లడించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు, మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తే స్థానికంగా మరిన్ని ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు ఏర్పడటంతో పాటు ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఎంఎస్ఎంఈలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, డిజిటల్ మార్కెటింగ్తో పాటు ఆధునిక యంత్రాలు, సాంకేతిక పద్ధతులను వినియోగించుకోవాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులు ఉన్నప్పటికీ సరైన ప్రచారం, మార్కెటింగ్, బ్రాండింగ్ లేకపోవడం వల్ల అనేక స్థానిక ఉత్పత్తులు ఆశించిన స్థాయిలో మార్కెట్ను పొందలేకపోతున్నాయని తెలిపారు. అరకు కాఫీ తరహాలో కలంకారి, వెంకటగిరి చీరలు, నారాయణవనం చేనేత తదితర స్థానిక ఉత్పత్తులకు కూడా సమర్థవంతమైన బ్రాండింగ్, మార్కెటింగ్ అవసరమని పేర్కొన్నారు. వ్యాపార సంస్థల విజయానికి సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ ఎంతో కీలకమని తెలిపారు. ఆర్థిక ప్రణాళిక, వనరుల సమర్థ వినియోగం, ఖర్చుల నియంత్రణపై పారిశ్రామికవేత్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సహాయ, ప్రోత్సాహకాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. బ్యాంకర్లు, మెప్మా, డీఆర్డీఏ ద్వారా రుణ సదుపాయాలు, పరిశ్రమల శాఖ ద్వారా అందించే రాయితీలు, ఏపీఐఐసీ ద్వారా పారిశ్రామిక అవసరాలకు భూ కేటాయింపులు వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పారిశ్రామికవేత్త ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రుణ సదుపాయాలు మరియు ఇతర ప్రయోజనాలను పొందేందుకు అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. మహిళా సంఘాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పథకాలు, శిక్షణా కార్యక్రమాలు, ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని, తద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడంతో పాటు మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

# అభివృద్ధి పనులను కుప్పం నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**తిరుపతి, సెప్టెంబర్ 22 మనం న్యూస్:** పట్టణాల రూపురేఖలు మార్చేలా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లల్లో వివిధ అభివృద్ధి పనులను కుప్పం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా పట్టణ స్థానిక సంస్థలల్లో రూ.11,359 కోట్ల విలువైన పనులకు, 123 మున్సిపాలిటీల్లో రూ.7469 కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి వర్చువల్ విధానంలో శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియం నుండి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ , మున్సిపల్ కమిషనర్ జయకృష్ణ,రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్, తుడా చైర్మన్ డాలర్ దివాకర్, ఎస్ వి బి సి చైర్మన్ శ్రీధర్ వర్మ,, పనబాక లక్ష్మి, రుద్ర కోటి శివ, వివిధ బోర్డు నెంబర్లు చైర్మన్లు



పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఎఎం) పనులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సుమారు రూ.5,800 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నట్లు తెలిపారు.



## సైబర్ నేరాలపై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి

**చిత్తూరు సెప్టెంబరు 22 మనం న్యూస్:** చిత్తూరు జిల్లా పరిధిలో సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించడం, సైబర్ మోసాల బారిన పడిన బాధితులకు సకాలంలో సహాయం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఒక ప్రకటనలో తెలిపారు.

సెప్టెంబరు16,2025 నుండి సెప్టెంబరు15,2026 వరకు చిత్తూరు జిల్లా పరిధిలోని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్ సి ఆర్ పి) ద్వారా మొత్తం 1,608 ఫిర్యాదులు నమోదయ్యాయి. పోలీసుల తక్షణ చర్యల ఫలితంగా సైబర్ మోసాలకు సంబంధించిన రూ.4,01,57,226/- నగదును హోల్ చేయడం జరిగింది. అందులో ఇప్పటివరకు రూ.2,15,60,922/- నగదును బాధితులకు రీఫండ్ చేయడం జరిగింది.

ఈ సందర్భముగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ... సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితి వంటి అంశాలను ఆసరాగా చేసుకుని బాధితుల నుంచి నగదు దోచుకుంటున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా ఇటువంటి మోసాలను చాలా వరకు నివారించవచ్చు.

# 2019-24 మధ్య చిత్తూరులో జరిగిన అక్రమాలు, దౌర్జన్యాలపై విచారణ..

- అభివృద్ధిని చూసి ఓర్వలేకే.. పీఏపై, నాపై విమర్శల హడావిడి..
- నేను ఒక్క క్వారీ చేసి సంపాదించినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా.. మీరు రాజకీయం వదిలేస్తారా..
- ఒక స్మగ్లర్, లిక్కర్ స్కాం నిందితులకు వైకాపాలో ఎలా సీట్ ఇచ్చారో..?
- విలేకరుల సమావేశంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు సెప్టెంబరు22 మనం న్యూస్:** విజయాలే లేని విజయానంద రెడ్డి.. జిల్లాకు ముఖ్యమంత్రి వస్తున్నారని ఏదో హడావిడి చేసి.. సొంత మీడియాలో, ఆయన సోషల్ మీడియాలో అసత్య పోస్టులు చేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ విమర్శించారు. చిత్తూరు ఎమ్మెల్యే పిఏ అక్రమంగా క్వారీలు చేసి కోట్లు సంపాదిస్తున్నట్లు వీడియోలు చేసి పోస్టులు చేయడంపై ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మంగళవారం విలేకరుల సమావేశంలో ఘాటుగా బదులిచ్చారు. అసలు క్వారీ ఎవరిది ? ఓనర్ ఎవరు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం ఒక రాజకీయ నాయకుడిగా తగదన్నారు. ఒక బీసీ ఉద్యోగి పీఏ గా ఉండడం జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. మీ చరిత్ర ఏమిటో? ఎర్రచందనం కేసులు ఎన్నో? మీ సంపాదన ఎలా వచ్చిందో ప్రజలకు తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాబట్టే.. తీవ్రమైన కేసులు ఉన్నా.. కక్ష సాధింపులకు దిగలేదని.. రాజకీయాలే చేయాలనుకుంటే.. పరిస్థితి మరోలా ఉండేదన్నారు. 14 ఎర్రచందనం



స్మగ్లింగ్ కేసులు ఉన్నాయని ఎన్నికల అఫిడవిట్ లో ప్రకటించిన వ్యక్తి మీరు కాదా అని ప్రశ్నించారు.

తాను ఎప్పుడూ వ్యక్తిగత దూషణలు చేయలేదని.. ఒక మంచి ఆశయం కోసం, నాన్నకు ఇచ్చిన మాట కోసం, చిత్తూరును అభివృద్ధి చేయాలని సంకల్పంతో రాజకీయాలకు వచ్చానని, ప్రజలు నమ్మకంతో గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టే దిశగా చిత్తూరులో గతంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు చేస్తుంటే ఓర్వలేక అనవసర ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులు ఉన్న వ్యక్తిని.. నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించిన పార్టీ ఎలాంటిదో చిత్తూరు ప్రజలు గుర్తించాలన్నారు. రాజకీయపరంగా నా ఎదుగుదలను చూసి ఓర్వలేకే.. నా పైనా, పిఏ పైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత వైకాపా ప్రభుత్వం 2019-24 మధ్య చిత్తూరు, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గాల్లో జరిగిన అక్రమ క్వారీలు, అక్రమ వసూళ్లు, ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం స్మగ్లింగ్ పై సమగ్ర విచారణ చేసి ముఖ్యమంత్రికి సమర్పించాలని కలెక్టర్ ని, ఎస్పీ ని కోరుతున్నట్లు చెప్పారు. సాక్షాత్తు ఏడుకొండలవాడు కొలువైన శేషాచలం కొండల్లో సంపదనంతా దోచుకొని ప్రస్తుతం ప్రజలపై పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా ఒక్క క్వారీని నిర్వహించి డబ్బు సంపాదించినట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానని.. మీరు రాజకీయాల నుంచి వైదొలుగుతారా అని సవాల్ చేశారు. మీరు చేసిన ఆరోపణలపై మా పీఏ కాణిపాకంలో ప్రమాణం చేయడానికి సిద్ధమని.. మీ ఎర్రచందనం కేసులపై ప్రమాణానికి మీరు సిద్ధమా అని ప్రశ్నించారు. నన్ను ఎన్నుకున్న ప్రజలకు మంచి చేయాలని, చిత్తూరు ను అభివృద్ధి చేయాలని లక్ష్యంతో ముందుకు వెళుతున్న సందర్భంలో.. అనవసరంగా రాజకీయాలు చేస్తూ.. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. డ్రామాలు ఆడడం నిజమైన రాజకీయం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, తెదేపా నగర అధ్యక్షుడు వరుణ్ కుమార్, వెంకటేష్ యాదవ్, నీరజాక్షలు, చిట్టిబాబు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# అపోలో-లీసెస్టర్ గ్లోబల్ పాథ్వే రెండో బ్యాచ్ ప్రారంభం

**చిత్తూరు, సెప్టెంబర్ 22 మనంన్యూస్ :** అపోలో యూనివర్సిటీ-యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ మధ్య కొనసాగుతున్న అంతర్జాతీయ విద్యా భాగస్వామ్యంలో భాగంగా గ్లోబల్ పాథ్వే ప్రోగ్రాంలో రెండో బ్యాచ్కు ఇండక్షన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బి.ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్, బీబీఏ బిజినెస్ మేనేజ్మెంట్ విత్ ఏఐ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఈ సందర్భంగా విద్యా ప్రస్థానం ప్రారంభమైంది.

కార్యక్రమానికి అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. నితిన్ ఎం. నగార్కర్, యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ డిప్యూటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హెన్రియెట్టా ఓ'కానర్, ప్రొ వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డా. ఆల్ఫ్రెడ్ జె. ఆగస్టిన్, రిజిస్ట్రార్ అనిల్ కుమార్ ఎస్ తదితరులు హాజరయ్యారు. యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్కు చెందిన ప్రొఫెసర్ లీనా సోధా, ప్రొఫెసర్ రాయ్ క్రోల్, ప్రొఫెసర్ డెబోరా ప్రైస్ తదితరులు ఆన్లైన్ ద్వారా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

అపోలో ఆంథమ్తో ప్రారంభమైన కార్యక్రమంలో దీపప్రజ్వలన అనంతరం అధ్యయ్ 2026 డిజిటల్ క్రియేటివ్స్ ఆవిష్కరణ చేశారు. అనంతరం అపోలో యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ క్యాంపస్లను పరిచయం చేసే వీడియోను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డా. నితిన్



నగార్కర్ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యాభ్యాసం, గ్లోబల్ ఎక్స్పోజర్ అందించే వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ విద్యను చిత్తూరులో ప్రారంభించి, చివరి ఏడాది యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్లో పూర్తి చేసే అవకాశముందని తెలిపారు.

యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ ప్రతినిధులు విద్యార్థులకు గ్లోబల్ లెర్నింగ్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై వివరించారు. ప్రొఫెసర్ డెబోరా ప్రైస్ ఆధునిక ప్రపంచంలో అవసరమైన నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సూచించగా, ప్రొఫెసర్ రాయ్ క్రోల్ కంప్యూటింగ్ రంగంలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ లీనా సోధా విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ, వారి అంతర్జాతీయ విద్యా ప్రయాణానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అడ్మిషన్ లెటర్లను అందజేశారు.

# ఐదేళ్ల పదవీకాలంలో రూ.5 కోట్లతో అభివృద్ధి

- ప్రజల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేశాం
- ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి
- సహకరించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీటీసీలు, అధికారులకు కృతజ్ఞతలు

**ఏలేశ్వరం,సెప్టెంబర్,22:-(మనం న్యూస్):** ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తన పదవీకాలంలో మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, తనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధుల సేవలను ఆయన గుర్తుచేసుకున్నారు. ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పనిచేసినట్లు గొల్లపల్లి బుజ్జి తెలిపారు. ఐదేళ్ల కాలంలో ఏలేశ్వరం మండల పరిధిలో సుమారు రూ.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామాల అవసరాలను గుర్తించి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.



**ఎమ్మెల్యే సహకారం మరువలేనిది**

మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అందించిన సహకారం ఎంతో కీలకమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. అభివృద్ధి పనులకు సహకరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మండల ప్రజా పరిషత్ సభ్యులు, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బంది అందించిన సహకారంతోనే పలు పనులను పూర్తి చేయగలిగామని చెప్పారు.

ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో అధికారులతో సమన్వయంతో పనిచేశానని తెలిపారు. పరిపాలనా వ్యవహారాల్లో భాగంగా తన మాటలు లేదా నిర్ణయాల వల్ల ఏ అధికారి అయినా మనసు నొచ్చుకుని ఉంటే తనను క్షమించాలని మీడియా ముఖంగా కోరారు. తనకు ఎవరిపైనా ఎలాంటి ద్వేషభావం లేదని, ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ఐదేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించానని స్పష్టం చేశారు.

**మీడియా సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు**

తన పదవీకాలంలో నిర్వహించిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో ముద్రిత, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అందించిన సహకారాన్ని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడంలో మీడియా ప్రతినిధులు కీలక పాత్ర పోషించారని అన్నారు.

ఐదేళ్ల పదవీకాలంలో తనతో కలిసి పనిచేసిన ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు, మండల ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరి సహకారాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటానని గొల్లపల్లి బుజ్జి పేర్కొన్నారు.

## స్నేహబోరా... అక్షరాల అగ్నిపర్వతం!

ఖద్దరు కంత్రీల కపట వ్యూహాల్ని
నడిరోడ్డు మీద నగ్నంగా నిలబెట్టి
ఆమె నిజాల తోలు తీస్తుంటే...
వ్యవస్థ శ్వాస నిలిచిపోవాల్సిందే!
ఆమె పెదవి విప్పితే ఆకాశం బద్దలవ్వాలి,
ఆమె అడుగు పడితే భూమి కంపించాలి!
ఆమె నినదించే అగ్నికణం... నేహా బోరా!
అక్రమార్కుల గుండెల్లో గుబులు రేపి,
సూర్యచంద్రులే దిక్కులు మార్చి,
కృష్ణ బిలాల వెనుక దాక్కోవాలి!
అవును!
ఇది ఏడు సముద్రాల లావా ముద్దతో
సమకాలీన సమాజపు నెత్తిమీద
కొట్టిన క్లైమాక్స్ దెబ్బ!
రెక్కాడితే గాని డొక్కాడనోడి,
గుడిసె ముంగిటకు బుల్డోజర్ వస్తే...
ఆమె గొంతు నుండి దూసుకొచ్చిన
శబ్దతరంగానికి,
ఢిల్లీ సామ్రాజ్యపు అహంకార పునాదులు ముక్కలై
అనంత విశ్వంలో దిక్కులేకుండా తేలుతున్నాయి!
అందుకే కదా... ఆ మనువాద మాఫియాకి
ఒంటి నిండా అపరాధ భావపు
డెడ్లీ చెమటలు పట్టి
ఖాకీ నెట్వర్క్‌తో హత్యా స్కెచ్లు వేయిస్తున్నారు!
దగాపడ్డ ఈ దేశపు పొలిమేరల్లో
జ్ఞాన భిక్షను బ్లాక్ మార్కెట్ సరుకు చేశారు!
యూపీలో ఇరవై ఏడు వేల బడులకి డెడ్ లాక్...
దేశవ్యాప్తంగా తొంభై నాలుగు వేల,
అక్షరాల గొంతుకలకి నిరంకుశ సైలెంసర్లు!
లక్షల టీచర్ పోస్టులని తొక్కిపెట్టి
సరస్వతీ దేవి కళ్లల్లో, రక్త కన్నీళ్లు పారిస్తున్నారు
ఆ అధికార రాబందులు!
లించింగ్ అనే డార్క్ వెబ్ కల్చర్తో
మనుషుల మధ్య విషపు సుడిగుండాల్ని,
చేతులారా ట్రిగ్గర్ చేస్తున్నారు!
చుట్టూ ముసిరిన మీడియా తోడేళ్ల మైకుల మధ్య
సత్యాన్ని క్రాష్ చేసే కెమెరా ఉచ్చుల మధ్య
భయమనే పదానికే గర్భశోకం తెప్పిస్తూ...
నిర్భయంగా నిలబడి
మైండ్ బ్లోయింగ్ పొలిటికల్ క్లాస్ పీకుతోంది!
ఇకనైనా గొర్రెల మందల్లా మౌనంగా ఉంటే
మన చరిత్రే సమాధైపోతాది సామీ!
మనమంతా థండర్ స్ట్రోమ్లా నినదించాలి
టైమ్ బాంబులాంటి ఈ కాలాన్ని ఎదిరించి...
ఆ నిజాల నిప్పుకణాన్ని గుండెల్లో దాచుకోవాలి!

**- సర్వేశ్వరరావు నీలం**
630 4664 725

# ప్లాస్టిక్ కరెన్సీ భారత్‌లో సాధ్యమేనా?



ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ ద్రవ్య వ్యవస్థలలో కూడా విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. సాంప్రదాయ కాగితపు నోట్ల స్థానంలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టడం ఈ దిశగా ఒక ముఖ్యమైన అడుగు.

కాగితపు నోట్లు త్వరగా చిరిగిపోవడం, తేమ మరియు మురికి వల్ల పాడైపోవడం వంటి సమస్యలకు ప్లాస్టిక్‌నోట్లు ఒక ప్రభావవంతమైన ప్రత్యామ్నాయంగా కనిపి స్తాయి. నాణ్యత, మన్నిక మరియు భద్రత దృష్ట్యా ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా వంటి అనేక దేశాలు ఇప్పటికే ప్లాస్టిక్ కరెన్సీని విజయవంతంగా ఉపయోగిస్తున్నాయి. భారత్ వంటి భారీ జనా భా ఉన్న దేశంలో ప్లాస్టిక్ కరెన్సీ అమలు సాధ్యమా, దాని సాధ్యా సాధ్యాలు మరియు పర్యవసానాల పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

భారతదేశంలో ప్లాస్టిక్ కరెన్సీని ప్రవేశపెట్టడం సాధ్యమే అయినప్పటికీ, దానికి గణనీయమైన తయారీ, సాంకేతిక మరియు ఆర్థిక సవాళ్లు ఉన్నాయి. ప్లాస్టిక్ నోట్ల ముద్రణకు ప్రత్యేకమైన 'పాలిమర్ శాండ్విచ్ ఫిల్మ్' మరియు అధునాతన ప్రింటింగ్ యంత్రాలు అవసరం.

ప్రారంభంలో దీని తయారీ మరియు ముద్రణ వ్యయం కాగితపు నోట్ల కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది ఏటీఎం మిషన్లను ప్లాస్టిక్ నోట్లకు అనుగుణంగా రీ-కాలిక్యులేట్ చేయాల్సి ఉంటుంది. అయితే, భారత దేశంలో నగదు రహిత లావాదేవీలు మరియు యుపిఐ వినియోగం వేగంగా పెరుగు తున్నందున, రొటేషన్‌లో ఉండే భౌతిక నోట్ల అవసరం క్రమంగా తగ్గుతోంది. కాబట్టి, చిన్న విలువ కలిగిన నోట్ల (ఉదాహరణక్కు రూ.10,రూ.20,రూ.50) రూపంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్లాస్టిక్ కరెన్సీని ప్రారంభించి, దశలవారీగా విస్తరించడం సంపూర్ణంగా సాధ్యమే.

ప్లాస్టిక్ కరెన్సీని ప్రవేశపెట్టడం వల్ల ఆర్థిక వ్యవస్థకు చేకూరే ప్రధాన ప్రయోజనాల్లో నాణ్యత మరియు దీర్ఘకాలిక మన్నిక అత్యంత కీలకమైనవి. సాధారణ కాగితపు నోట్లు నీరు, చెమట లేదా మురికి తగలడం వల్ల త్వరగా పాడైపోతాయి. వాటి సగటు జీవితకాలం కేవలం ఒకటి నుండి రెండు సంవత్సరాలు మాత్రమే ఉంటుంది. అయితే పాలిమర్‌తో తయారయ్యే ప్లాస్టిక్ నోట్లు నీటి నిరోధకత కలిగి ఉండి, కాగితపు నోట్ల కంటే నాలుగైదు రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. దీనివల్ల ప్రభుత్వం మరియు రిజర్వ్ బ్యాంక్ ప్రతి ఏటా చిరిగిపోయిన నోట్ల స్థానంలో కొత్త నోట్లను ముద్రించడానికి పెట్టే వేల కోట్ల రూపాయల భారం తగ్గుతుంది.

మరో విశేషమైన అనుకూల పర్యవసానం ఏమిటంటే, నకిలీ నోట్ల చెలామణిని ఇది దాదాపు పూర్తిగా అరికడుతుంది. ప్లాస్టిక్ నోట్ల తయారీకి అత్యంత సంక్లిష్టమైన పాలిమర్ సాంకేతికత, పారదర్శక విండోలు మరియు ప్రత్యేకమైన హోలోగ్రామ్‌లు అవసరమవుతాయి. సాధారణ ముద్రణ యంత్రాలతో వీటిని నకిలీ చేయడం దాదాపు అసాధ్యం. ఇది ఆర్థిక వ్యవస్థలోకి అక్రమ నగదు మరియు నకిలీ నోట్లు రాకుండా అడ్డుకట్ట వేసి, దేశ ఆర్థిక భద్రతను బలోపేతం చేస్తుంది. దీనితో పాటు, పరిశుభ్రత మరియు ప్రజారోగ్య దృష్ట్యా కూడా ప్లాస్టిక్ కరెన్సీ ఎంతో మేలైనది.

కాగితపు నోట్లు చేతులు మారే క్రమంలో బాక్టీరియా, వైరస్‌లు మరియు ఇతర సూక్ష్మజీవులను త్వరగా పీల్చుకుని వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయి. ప్లాస్టిక్ నోట్లకు మురికి లేదా తేమ అంటుకోకపోవడం వల్ల ఇవి శుభ్రంగా ఉంటాయి. అవసర మైతే వీటిని సులభంగా శుభ్రం చేయడానికి కూడా వీలుంటుంది. కాబట్టి రోజువారీ లావాదేవీలలో ప్లాస్టిక్ కరెన్సీ విని యోగం ప్రజలకు మరింత సురక్షితమైనది మరియు ఆరోగ్యకరమైనది.

ప్లాస్టిక్ కరెన్సీ వినియోగం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థలో లాజిస్టిక్స్ మరియు రవాణా వ్యయం గణనీయంగా తగ్గుతుంది. కాగితపు నోట్లు త్వరగా పాడైపోవడం వల్ల రిజర్వ్ బ్యాంక్ నిరంతరం పాత నోట్లను సేకరించడం, వాటి స్థానంలో కొత్త నోట్లను ముద్రించి దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకులు, ఏటీఎంలకు తరలించడం వంటి ప్రక్రియలపై భారీగా వెచ్చిస్తుంది. ప్లాస్టిక్ నోట్లు సుదీర్ఘకాలం మన్ను తాయి కాబట్టి, ఈ రవాణా మరియు నిర్వహణ ప్రక్రియలు తగ్గి, ఆ డబ్బును ఇతర అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఉపయో గించుకునే వీలు కలుగుతుంది.



ఈ నోట్లు దృశ్య వికలాంగులు మరియు చూపు మందగించిన వారికి నగదు లావాదేవీలలో ఎంతో సహాయపడతాయి. ప్లాస్టిక్ నోట్లపై ప్రత్యేకమైన ఉబ్బెత్తు గుర్తులు సుదీర్ఘకాలం మెరుపు తగ్గకుండా, అరిగిపోకుండా ఉంటాయి. కాగితపు నోట్లపై ఉండే గుర్తులు కొన్ని నెలల వాడకం తర్వాత అరిగిపోతాయి, కానీ ప్లాస్టిక్ నోట్లపై ఉన్న స్పర్శ గుర్తులు ఏళ్ల తరబడి స్పష్టంగా ఉంటాయి.

దీనివల్ల దృష్టిలోపం ఉన్నవారు ఇతరులపై ఆధారపడకుండా నాణేలు, నోట్ల విలువను సులభంగా గుర్తించగలరు. ఆధునిక ఏటీఎంలు మరియు క్యాష్ డిపాజిట్ మెషిన్ల నిర్వహణను ప్లాస్టిక్ కరెన్సీ మరింత సులభతరం చేస్తుంది. కాగితపు నోట్లు నలిగిపోవడం లేదా మడతపడటం వల్ల తరచుగా ఏటీఎం మిషన్లలో చిక్కుకుపోవడం యంత్రాలు పనిచేయక పోవడం వంటి సమస్యలు వస్తుం టాయి. ప్లాస్టిక్ నోట్లు తమ ఆకారాన్ని త్వరగా కోల్పోవు కాబట్టి మెషిన్లలో సులభంగా ప్రాసెస్ అవుతాయి. ఇది బ్యాంకింగ్ రంగానికి నిర్వహణ ఖర్చులను తగ్గిం చడమే కా కుండా, వినియోగదారులకు యంత్రాల వద్ద అంతరాయం లేని వేగవంతమైన సేవలను అందిస్తుంది.

పాలిమర్ కరెన్సీ నోట్ల ముద్రణకు సాధారణ కాగితపు నోట్ల తయారీ కంటే 30-60 శాతం ఎక్కువ వ్యయం అవుతుంది. తక్కువ విలువ కలిగిన నోట్ల తయారీకి వాటి ముఖ విలువ కంటే 20-24 శాతం ఎక్కువ ఖర్చవుతుంది.

సాధారణంగా కరెన్సీ నోట్ల ఉత్పత్తి, నిర్వహణల కోసం వాటి కొనుగోలు విలువలో కొంత శాతం మాత్రమే ఖర్చైతేనే అవి సమర్థవంతంగా పని చేస్తున్నట్లు అర్థం. అందువల్ల పాలిమర్ కరెన్సీ నోట్ల ముద్రణ మీద పలు సందేహాలు వెలువడు తున్నాయి.

ఈ నోట్ల తయారీ వ్యయం వాటి కోసం ఉపయోగించే పాలీప్రొపిలీన్ పదార్థం మీద కూడా ఆధారపడి ఉంటుంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలలో ఒడిదుడుకులు ఎక్కువగా ఉండడం వల్ల ఈ పదార్థం ధరలు కూడా మారుతూ ఉంటాయి. దేశంలో అవసరమైన పాలీప్రొపిలీన్ పదార్థంలో ఐదింట ఒకవంతును భారత్ దిగుమతుల ద్వారానే సేకరిస్తారు అందువల్ల విదేశీ సర్వరాల మీద ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. పాలిమర్ నోట్ల వల్ల ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ సమస్య ఏర్పడుతుందని, ప్రత్యేకమైన రీసైక్లింగ్ కేంద్రాలు అవసరమవుతాయనీ ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనివల్ల వాతావరణ పరమైన సమస్యలు పెరిగిపోతాయి.

మొత్తంగా పరిశీలిస్తే, ప్లాస్టిక్ కరెన్సీ అనేది ఆధునిక ఆర్థిక వ్యవస్థకు రక్షణ, సుదీర్ఘ మన్నిక మరియు పరిశుభ్రతను అందించే ఒక అద్భుతమైన సాంకేతిక పరిణామం. సాంప్రదాయ కాగితపు నోట్లతో పోలిస్తే ఇది నకిలీ నోట్ల చెలామణిని అరికట్టడంలో, ప్రభుత్వానికి ముద్రణా వ్యయాన్ని తగ్గించడంలో మరియు దివ్యాంగులకు సహాయపడటంలో ఎంతగానో ఉపయోగపడుతుంది.

అయితే, పర్యావరణ పరిరక్షణ మరియు రీసైక్లింగ్ ప్రక్రియల పట్ల స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకోవడం అత్యంత ఆవశ్యకం.

భారతదేశం వలే డిజిటల్ చెల్లింపులు వేగంగా పెరుగుతున్న వాతావరణంలో, భౌతిక రూపంలో ఉండే నగదును మరింత సురక్షితంగా ఉంచడానికి దశలవారీగా ప్లాస్టిక్ కరెన్సీని అమలు చేయడం దేశ ఆర్థిక భద్రతకు మరియు ద్రవ్య నిర్వహణకు ఎంతగానో మేలు చేస్తుంది.

**- సుధాకర్.ఏ.వి**
9000674747

# మరో ప్రపంచ యుద్ధాన్ని ఐరాస ఆప గలదా?

అంతర్జాతీయ శాంతి దినోత్సవం ఐక్యరాజ్య సమితి దేశాలన్నీ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 21 తేదీన జరుపుకుంటాయి. అంతర్జాతీయంగా కాల్పుల విరమణ, అహింస, శాంతి, సోదరభావాల సాధన కోసం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. 1981లో సెప్టెంబర్ 21న ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశం ప్రారంభ సందర్భంగా కోస్టారికా సమర్పించిన తీర్మానం ప్రకారం ప్రతి ఏటా సెప్టెంబర్ 21ని ప్రపంచ శాంతి దినంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రకటించింది. తొలి ప్రపంచశాంతి దినాన్ని 1982 సెప్టెంబర్ లో నిర్వహించారు. 2002 లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సెప్టెంబర్ 21 వ తేదీని అంతర్జాతీయ శాంతి దినోత్సవ నిర్వహణకు శాశ్వత తేదీగా ప్రకటించడం జరిగింది.

ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చట్టం, భద్రత, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి , మానవ హక్కులపై సమష్టి కృషి చేసేందుకు ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒక అంతర్జాతీయ సంస్థ. 20వ శతాబ్దం మానవాళిని అతలా కుతలం చేసింది. 1930 నాటి మహామాంద్యం వల్ల ఐరోపాలో నియంతలు అధికార పీఠాలు అధిరోహించారు. ఆపై సంభవించిన రెండో ప్రపంచ యుద్ధం, మానవాళి చరిత్రనే రక్తాక్షరాలతో లిఖించింది. అలాంటి పరిస్థితుల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఒక బహుముఖీన అంతర్జాతీయ సంస్థ అవసరమని ప్రపంచ నాయకులు భావించారు. ఆ భావనకు ఒక రూపం కల్పించారు. తరవాత అదే ఐక్యరాజ్య సమితిగా ఆవిర్భ వించింది. నానాజాతి సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్) రెండవ ప్రపంచ యుద్ధాన్ని నివారించుటలో విఫలమగుటచే దానికి ప్రత్యామ్నాయంగా 1945లో ఐక్యరాజ్య సమితి స్థాపించ బడింది. ప్రతి సభ్య దేశమూ ఐ.రా.స. సాధారణసభలో సభ్యత్వం కలిగి ఉంటుంది. ఐ.రా.స. చార్టర్ 2వ ఛాప్టర్ 4వ ఆర్టికల్ ప్రకారం ఏదైనా దేశానికి ఐ.రా.స. సభ్యత్వం రావాలంటే ఐ.రా.స. భద్రతాసభ ఆమోదంపై సాధారణ సభ తీర్మానం జరగాలి. నియమాల ప్రకారం సంపూర్ణ స్వాధిపత్యం ఉన్న దేశాలు మాత్రమే సభ్యత్వానికి అర్హత కలిగి ఉంటాయి. కాని ఐ.రా.స. ఏర్పాటు సమయంలో చేరిన నాలుగు ఆరంభ సభ్య దేశాలకు (బెలారస్, భారత దేశం, ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్) అప్పటికి సంపూర్ణ స్వాతంత్ర్యం లేదు. అంతే కాకుండా భద్రతా సభ ఆమోదం ఉండాలన్న నిబంధన కారణంగా మాంటివిడియో కన్వెన్షన్ ప్రకారం స్వాధిపత్యం కలిగిన కొన్న దేశాలు కూడా, మరి కొన్ని ఐ.రా.స. సభ్య దేశాలు వ్యతిరేకించిన కారణంగాసభ్యత్వం కలిగి లేవు. 1945లో ఐ.రా.స. ఏర్పడినప్పుడు 51మంది సభ్య దేశాలున్నాయి. వాటిలో 49 దేశాలు ఇప్పటికీ సభ్యులుగా ఉన్నాయి. లేదా వారి సభ్యత్వం వేరే దేశాలకు సంక్రమించింది. ఉదాహరణకు సోవియట్ యూనియన్ సభ్యత్వం రష్యాకు సంక్రమించింది. ప్రస్తుతము 193 దేశాలు ఐక్యరాజ్య సమితిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితిలో ప్రధానంగా 6 అంగాలు ఉన్నాయి. సర్వప్రతినిధి సభలో ఐక్యరాజ్య సమితిలో ప్రవేశించిన అన్ని దేశాలకు సభ్యత్వం ఉండగా, భద్రతా మండలిలో 15 దేశాలకు మాత్రమే సభ్యత్వం ఉంటుంది. అందులో 10 దేశాలు రెండేళ్ళ కోసారి ఎన్నిక



ద్వారా సభ్యత్వం పొందగా, మరో 5 దేశాలు శాశ్వత సభ్య దేశాలు. అవి: అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్. ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది. దీని ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుట్టెర్స్. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలోనే 1941 ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు థియోడార్ రూజ్వెల్ట్ , బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ అట్లాంటిక్ సముద్రంలో ఒక ఓడలో సమావే శమై కుదుర్చుకొన్న ఒప్పందాన్ని అట్లాంటిక్ ఛార్టర్ అంటారు. ప్రాదేశిక సమగ్రత కాపాడడం, యుద్ధ భయాన్ని తొలగించడం, శాంతిని నెలకొ ల్పడం, నిరాయుధీ కరణ వంటి ఎనిమిది అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ ఒప్పందమే తరువాత ఐక్య రాజ్య సమితి సిద్ధాంతాలకు మౌలిక సూత్రాలుగా గుర్తింపు పొందినది. తరువాత 1944లో వాషింగ్టన్‌లోని డంబార్టన్ ఓక్స్ వద్ద జరిగిన సమావేశంలో అమెరికా, బ్రిటన్, రష్యా ప్రతినిధులు ఐ.రా.స. ప్రకటన పత్రం ముసాయిదాను తయారు చేశారు. 1945 ఫిబ్రవరిలో యాల్టా సమావేశంలో అమెరికా, బ్రిటన్, రష్యా నేతలు ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఒక అంతర్జాతీయ సంస్థను స్థాపించాలని తీర్మానం చేశారు. శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో 1945 ఏప్రిల్ 25నుండి జూన్ 26 వరకు జరిగిన అంతర్జాతీయ సమా వేశంలో 51 దేశాల ప్రతినిధులు పాల్గొని ఐక్య రాజ్య సమితి ఛార్టర్‌పై సంతకాలు చేశారు. 1945 అక్టోబరు 24న న్యూయార్క్ నగరంలో ఐక్య రాజ్య సమితి లాంఛనంగా ప్రారంభమైంది.

యుద్ధాలు జరగకుండా చూడటం, అంతర్జాతీయ తగాదాలను శాంతి యుతంగా పరిష్కరించడం, దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడం, అంతర్జాతీయ బాధ్యతలను అన్ని దేశాలు గౌరవించే టట్లు చేయడం, సాంఘిక అభివృద్ధి సాధించి, మానవ జీవితాలను సుఖమయం చేయడం తదితరాలు సమితి ఆశయాలు. అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్వెల్ట్ 'యునెటైడ్ నేషన్స్' అనే పదాన్ని తొలిసారి ప్రవేశ పెట్టాడు. ఐరాస పతాకాన్ని 1947 అక్టోబరు 20న ఆమోదించారు. ఈ పతాకం లేత నీలం, తెలుపు రంగుల్లో ఉంటుంది. పతాకం మధ్యలో ఐరాస చిహ్న మైన ప్రపంచ పటం రెండు ఆలివ్ కొమ్మల మధ్య ఉంటుంది. ఆలివ్ కొమ్మలు శాంతికి చిహ్నం. ఐరాసకు ఆరు అధికారిక భాషలున్నాయి అవి చైనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్, అరబిక్.

ఐక్యరాజ్య సమితి స్థాపించిన నాటి నుండి నేటి వరకు 76 సంవత్సరాల కాలంలో ప్రపంచ శాంతికి దోహదం చేసే ఎన్నో కార్యకలాపాలను నిర్వహించింది. ఐక్యరాజ్య సమితిలోని అగ్ర రాజ్యాల ఆధిపత్యం కొనసాగు తుండటం చిన్న దేశాలకు శాపంగా మారుతున్నది. అగ్ర రాజ్యాల చేతిలో ఉన్న ఐరాస తన లక్ష్యాలను నెరవేర్చలేక పోతున్నది. కాలం గడుస్తున్న కొద్దీ ఐరాస బలహీన పడుతున్నదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 76 ఏళ్ళ పాటు ప్రపంచ శాంతికి అవిరళమైన కృషి చేసిన ఐరాస మరో ప్రపంచ యుద్ధం రాకుండా చూడాలి. ఆ దిశగా కృషి చేస్తూ, మానవాళిని కాపాడ గలదని మనసారా ఆశిద్దాం.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9449595494

## జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్




- **23 న జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు .. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలి**
- **జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**

తిరుపతి, సెప్టెంబర్ 22 మనం న్యూస్: తిరుపతి జిల్లాలోని యువతలో సృజనాత్మకత, ప్రతిభ, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికితీసే లక్ష్యంతో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ నందు జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోస్టర్ ను సెట్విన్ సీ ఈ ఓ తో కలిసి యశ్వంత్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు ఈ నెల 23 న ఉదయం 9.00 గం.లకు శ్రీ వేంకటేశ్వర పశు వైద్య కళాశాల ఆడిటోరియం న ప్రారంభం అవుతుందని, జిల్లాలోని 15 నుండి 29 సంవత్సరాల వయస్సు గల ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ యువజన ఉత్సవాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. యువజన ఉత్సవాలలో భాగంగా జానపద నృత్యం, జానపద గీతం, పెయింటింగ్, వీధి నాటకం, కథ రచన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విజేతలను తదుపరి రాష్ట్ర స్థాయి, రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎంపికయ్యే విజేతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణం, భోజనం, వసతి తదితర సదుపాయాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన, ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## రూ.22 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సత్యప్రభ శ్రీకారం




ఏలేశ్వరం,సెప్టెంబర్,22:-(మనం న్యూస్): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మున్సిపాలిటీలో హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా రూ.22 కోట్లతో చేపట్టనున్న పట్టణ అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఏలేశ్వరంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొని, ముఖ్యమంత్రి ప్రసంగాన్ని కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. అనంతరం పట్టణంలో రూ.22 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆవిష్కరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు మూది నారాయణస్వామి,బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా 21 మున్సిపాలిటీ ల్లో హైబ్రీడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా పట్టణాల అభివృద్ధికి చర్యలు చేపడుతుండగా, అందులో ఏలేశ్వరం మున్సిపాలిటీకి అవకాశం లభించడం పట్ల ఎమ్మెల్యే సత్యప్రభ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే సత్యప్రభ పేర్కొన్నారు. అర్బన్ డెవలప్మెంట్ ద్వారా ఏలేశ్వరం పట్టణానికి మరో రూ.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.వీటితో కలిపి ఇప్పటివరకు ఏలేశ్వరం పట్టణంలో సుమారు రూ.110 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, అలమండ చలమయ్య, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, అన్నవరం ట్రస్ట్ బోర్డు మెంబెర్ పర్వత సురేష్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బద్ది మణి రామారావు, లింగంపర్తి సొసైటీ అధ్యక్షులు పెంటకోట మోహన్, గట్టెం వెంకటరమణ, మైరాల కనకారావు, వైభోగుల సుబ్బారావు, వాగు రాజేష్, జొన్నాడ వీరబాబు, కోణాల వెంకటరమణ, ఎండగుడి నాగబాబు, రుచి రమేష్, పలివెల వెంకటేష్, బుగత శ్రీను తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవం..శ్రీకల్యాణ వెంకన్న రథోత్సవం..!

**బ్రహ్మరథంపై ఊరేగిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు**

**అశ్వవాహనంపై కల్కి అవతారంలో స్వామి దర్శనం**

తిరుపతి రూరల్ సెప్టెంబరు22 మనం న్యూస్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు మంగళవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు బ్రహ్మరథంపై ఊరేగారు. గోవింద నామస్మరణలతో బ్రహ్మరథాన్ని భక్తులు ముందుకు లాగుతుండగా స్వామి, అమ్మవార్లు అభయ హస్తంతో దీవెనలను అందించారు. ఆలయం నుంచి బయలుదేరిన బ్రహ్మరథానికి ఉప్పు, మిరియాలు చల్లుతూ భక్తులు కర్పూర హారతులతో స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీవారి రథోత్సవం ముందు వృషభాలు, అశ్వాలు ఠీవిగా నడుస్తుండగా కళాకారులు, చెక్క భజనలు, కేరళ వాయిద్యాలు, కళాకారుల దేవతా రూపాలతో శోభాయమానంగా సాగింది. ప్రధాన ఆలయం నుంచి ఉదయం 7గంటలకు బయలుదేరిన స్వామి వారి బ్రహ్మరథం 11.30 గంటలకు తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. సుమారు 4.30 గంటల పాటు స్వామి వారి బ్రహ్మరథం గ్రామంలోని పురవీధుల్లో తిరుగుతూ భక్తుల నుంచి పూజలు అందుకుంది.



**అశ్వవాహనంపై కల్కి అవతారం**

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు అశ్వవాహనంపై కల్కి అవతారంలో మంగళవారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. కలియుగంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు స్వామి వారు కల్కి అవతారం ధరించి అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులను పాప విముక్తులను చేశారు. మనసుని పరవశింప చేసే గోవింద నామాలు.. ఆధ్యాత్మిక అనుభూతిని ఇనుమడింపజేసే వేద పండితుల మంత్రాలు.. శ్రవణానందకరంగా మంగళ వాయిద్యాలు.. కన్నుల పండువుగా కళాబృందాల నృత్య అభినాయలు.. ఠీవిగా ముందుకేగుతున్న అశ్వాలు.. అడుగడుగునా కర్పూర హారతుల నడుమ మలయప్ప స్వామి కల్కి అవతారంలో అశ్వ వాహనంపై భక్తులను కటాక్షించారు. ఈ వాహన సేవల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులు, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

**నేడు వేడుకగా చక్రస్నానం..**

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో తొమ్మిదవ రోజు బుధవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల మధ్యన చక్రతాళ్వార్ కు పుష్కరిణిలో చక్రస్నానం చేయించనున్నారు. పుష్కరిణి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించిన తరువాత పుష్కరిణిలో చక్రతాళ్వార్ ను నీటి ముంచుతారు. బ్రహ్మోత్సవాలలో ఆఖరి ఘట్టంగా చక్రస్నానం నిర్వహించడం ఆనవాయితీ. అదే రోజు సాయంత్రం జరిగే ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలుకుతుంది.

## శ్రీ స్వామివారిని దర్శించుకున్నఏపీ మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ



**సింహాచలం, సెప్టెంబర్ 22, 2026:** ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ దంపతులు మంగళవారం సింహాచలం శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన చైర్పర్సన్ రాయపాటి శైలజ, దంపతులకు ఆలయ పర్యవేక్షణ అధికారి జి.వి.ఎస్.కె. ప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు.

అనంతరం ఆలయ పర్యవేక్షణ అధికారి జి.వి.ఎస్.కె. ప్రసాద్ స్వామివారి ప్రసాదాలను చైర్పర్సన్ రాయపాటి శైలజ దంపతులకు ప్రసాదాలను అందజేశారు.

# దేశ భద్రతకు సంబంధించిన కేసుల్లో వేగవంతమైన న్యాయం కీలకం

### ప్రత్యేక కోర్టు ప్రారంభోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

### విశాఖపట్టణం కేంద్రంగా ఎన్ఐఏ కోర్టు.. తొలి జడ్జిగా డి. శేషయ్య నియామకం

### పాల్గొన్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సన్నీ యాదవ్



**విశాఖపట్నం, సెప్టెంబర్ 22:** ఎన్ఐఏ(నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ-జాతీయ దర్యాప్తు సంస్థ) చట్టం పరిధిలో నమోదయ్యే కేసులను సత్వరంగా పరిష్కరించేందుకు విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానం కీలకంగా పనిచేస్తుందని హైకోర్టు న్యాయమూర్తి, విశాఖపట్టణం జిల్లా కోర్టు పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ కాంప్లెక్స్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానాన్ని మంగళవారం ఆయన వర్చ్యువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన దేశ భద్రత, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ఎన్ఐఏ కేసులను అనవసరంగా పెండింగ్లో ఉంచకుండా చట్టపరమైన ప్రక్రియను అనుసరిస్తూ త్వరితగతిన విచారణ పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నేరం చేసిన వారికి చట్టప్రకారం శిక్ష పడటంతో పాటు, నిర్దోషులకు ఎలాంటి అన్యాయం జరగకుండా విముక్తి లభించేలా న్యాయ ప్రక్రియ సాగాలని పేర్కొన్నారు. గతంలో ఎన్ఐఏ చట్టం పరిధిలోని కేసుల విచారణకు విశాఖపట్నం, విజయవాడలో రెండు నిర్దేశిత న్యాయస్థానాలు ఉండేవని తెలిపారు. గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలు, భారత ప్రభుత్వ విధాన నిర్ణయం మేరకు ప్రతి రాష్ట్రంలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్కు మంజూరైన ప్రత్యేక కోర్టును విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం ప్రాధాన్యమైన విషయమన్నారు. ఈ ప్రత్యేక న్యాయస్థానం ద్వారా ఎన్ఐఏ కేసుల విచారణ మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగి, బాధితులకు సకాలంలో న్యాయం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానానికి తొలి ప్రిసైడింగ్ ఆఫీసర్గా బాధ్యతలు స్వీకరించనున్న న్యాయమూర్తి డి. శేషయ్యను అభినందించారు.

## విశాఖ జూలో 4ఆసియా సింహం పిల్లల జననం



**విశాఖపట్నం/సెప్టెంబర్ 22:** ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో పరిరక్షణ సంతానోత్పత్తి కార్యక్రమంలో భాగంగా నాలుగు ఆసియా సింహం పిల్లలు జన్మించాయి.నెల రోజుల క్రితం పుట్టిన ఈ పిల్లలను తల్లి సింహం సంరక్షణలోనే ఉంచి, నిపుణులైన అధికారులు వాటి ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

అంతరించిపోతున్న అత్యంత అరుదైన ఆసియా సింహాల జాతిని కాపాడుకోవడంలో ఈ జననం ఒక కీలక విజయమని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. జూ సిబ్బంది శాస్త్రీయ నిర్వహణ,నిరంతర సంరక్షణ వల్లే ఇది సాధ్యమైందని ఆమె పేర్కొన్నారు.



## నదీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత

### తుంగభద్ర తీరంలో స్వచ్ఛతా హి సేవా

### సీడబ్ల్యూసీ సబ్ డివిజనల్ ఇంజనీర్ బి. నాగార్జున

**మంత్రాలయం, సెప్టెంబర్ 22(మనం న్యూస్);** నదీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీడబ్ల్యూసీ సబ్ డివిజనల్ ఇంజనీర్ బి. నాగార్జున అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లోని తుంగభద్ర నదీ తీరంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జూనియర్ ఇంజనీర్ సి. మధు కల్యాణ్,ఎస్.డబ్ల్యూ.ఏ ఎం. షైక్షా వలి, పాటు కార్యాలయ సిబ్బంది నది తీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించి చెత్తను గ్రామ పంచాయతీ ట్రాక్టర్లో తరలించి సురక్షితంగా పారవేయడానికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నది మన పర్యావరణంలో కీలక భాగమని, నదీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని₹₹ తెలిపారు. నదిని పరిశుభ్రంగా కాపాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

## మహా విశాఖ నగరంలో రూ .3,892 కోట్లతో 16ప్రాజెక్టుల శంకుస్థాపన

### ఇచ్చిన గడువు లోగా పనులు పూర్తికావాలి

### రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. పి.నారాయణ



**విశాఖపట్నం, సెప్టెంబర్ 22(మనం న్యూస్):** మహా విశాఖ నగరానికి మహర్దశ పట్టిందని, అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసుకొని ఏడాదిన్నర లోపలే పూర్తి చెయ్యాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. మంగళవారం కుప్పం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 26 జిల్లాల్లో 123 మున్సి పాలిటీలలో 11,360 కోట్ల అభివృద్ధి పనులకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం పి. ఎం.పాలెం వద్దనున్న వి.కన్వెన్షన్ సెంటర్ నందు ప్రత్యక్ష ప్రత్యక్ష ప్రసారాన్ని మంత్రి నారాయణ, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ తదితరులు వీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ మహా విశాఖ నగరంలో పలు మౌలిక సదుపాయాల కోసం జీవీఎంసీ ద్వారా రూ. 3531.47 కోట్లు, వీ ఎం ఆర్ డి ఏ ద్వార రూ.360.49 కోట్ల పనులకు శంకుస్థాపనలు జరిగాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో పలు ప్రాజెక్టులు నిలిచిపోయాయనీ , ఈ ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయిన పనులను సమీక్షించుకుని కేంద్రం సహాయం కోరడం జరిగిందని, కేంద్ర సహకారం తో పనులను తిరిగి చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.50 వేల కోట్ల మున్సిపల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఒక్క రోజే రూ. .11,369 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగిందను, ఇందులో తాగునీరు, డ్రైనేజీ, రహదారి పనులు ఉన్నాయని, ఇది ఒక చారిత్రాత్మకమని పేర్కొన్నారు.

## శ్రీ మఠంలో భాద్రపద శుద్ధ ఏకాదశి వేడుకలు



**మంత్రాలయం, సెప్టెంబర్ 22(మనం న్యూస్);** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో భాద్రపద శుద్ధ ఏకాదశి వేడుకలు మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థుల అధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భాద్రపద శుద్ధ ఏకాదశి ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతులు సుదర్శన హోమం చేసి , తప్త ముద్ర ధారణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మఠం అధికారులు , సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని ,తప్త ముద్ర ధారణ స్వీకరించారు.

## క్లిష్ట పరిస్థితులను అధిగమించి వైభవంగా వినాయక నిమజ్జనం: మంత్రి టీజీ భరత్



**కర్నూలు, సెప్టెంబర్ 22 (మనం న్యూస్):** నీటి కొరత వంటి క్లిష్ట పరిస్థితులను అధిగమించి వినాయక నిమజ్జనాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా కర్నూలులోని రాంబొట్ల దేవాలయం వద్ద వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, అనంతరం నిమజ్జన ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వినాయక చవితికి ముందు సుంకేసుల, కేసీ కెనాల్లో నీరు లేకపోవడంతో నిమజ్జనంపై కొంత ఆందోళన నెలకొందన్నారు. అయితే ముందుగానే అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టడం వల్ల సమస్యను పరిష్కరించుకోగలిగామని తెలిపారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనే అనుభవం అధికారులతో పాటు ప్రజలకు కూడా వచ్చిందన్నారు. నిమజ్జన ఏర్పాట్ల కోసం కష్టపడి పనిచేసిన జిల్లా అధికారులను మంత్రి అభినందించారు.

## నియోజకవర్గాల్లో మౌలిక వసతుల కల్పనకే పెద్దపీట

### రెండేళ్లలో అభివృద్ధి పనుల కోసం రూ.532 కోట్లు కేటాయింపు: స్పీకర్ అయ్యన్న పాత్రుడు



**నర్సీపట్నం, సెప్టెంబర్ 22(మనం న్యూస్):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం అధిక మొత్తంలో నిధులు కేటాయించడం జరుగుతుందని స్పీకర్ అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. మంగళవారం నర్సీపట్నంలో స్పీకర్ నేతృత్వంలో జరిగిన పట్టణాల ముఖచిత్రం మారేలా ప్రపంచ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధి - రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ శంకుస్థాపన మహోత్సవం₹ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండేళ్లలో రికార్డు స్థాయిలో నర్సీపట్నం నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.532 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. స్థానిక నేతలు ఈ అభివృద్ధిని ప్రజలకు చూపించాలని కోరారు.

**వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ వెల్లడి:**

వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు దూసుకుపోతో ందని, ఉత్తరాంధ్రను ఉత్తమాంధ్రగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాలన సాగుతుందని పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు సూచనల మేరకు నర్సీపట్నం అభివృద్ధికి ₹రూ.41.50 కోట్ల వీఎంఆర్డీఏ నిధులు₹ కేటాయించామని తెలిపారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**మహానంది, సెప్టెంబర్ 22(మనంన్యూస్):** ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ సాయి కుమార్ తెలిపారు. మంగళవారం మహానంది మండల పరిధిలోని అబ్బీపురం గ్రామంలో అటవీశాఖ టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటి డైరెక్టర్ చైతన్య కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఫారెస్ట్ రేయింజ్ అదికారి మురళీ క్రిష్ణ సూచనల మేరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డి ఆర్ ఓ హైమావతి తెలిపారు. గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ తేజ,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రాణా ప్రతాప్, పరమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు

- **మండపాల వద్ద విశేష పూజలు.. అన్నదానాలు..**
- **భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు**



**అన్నవరం, సెప్టెంబర్ 22(మనం న్యూస్):** కాకినాడ జిల్లా అన్నవరంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. గణనాథుని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా మండపాల వద్ద ప్రతిరోజూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళహారతులు, భజనలు, భక్తి గీతాలతో పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి. విఘ్నాలను తొలగించి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాన్ని ప్రసాదించాలని భక్తులు గణనాథుడిని ప్రార్థిస్తున్నారు.

**ఘనంగా అన్నదాన కార్యక్రమాలు**

వినాయక నవరాత్రుల సందర్భంగా పలు మండపాల వద్ద భక్తులు, నిర్వాహకుల ఆధ్వర్యంలో విశేషంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వెలమపేటలోని వరదయ్య గారి వీధి, మెయిన్ రోడ్ లోనే వాసవి మాత ఆలయం వద్ద, సుబ్బరాయపురంలోని బీసీ కాలనీలో పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదంగా భక్తులకు భోజన వితరణ చేపడుతున్నారు. అన్నదానం చేయడం ద్వారా భగవంతుని అనుగ్రహం లభిస్తుందనే విశ్వాసంతో భక్తులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

**భక్తి కార్యక్రమాలతో సందడి**

ప్రతిరోజూ సాయంత్రం భజనలు, భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉత్సవాలను మరింత వైభవంగా కొనసాగిస్తున్నారు. చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కుటుంబ సమేతంగా వినాయకుడిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు. విఘ్నేశ్వరుని కృపతో అన్నవరం ప్రజలకు సుఖశాంతులు, సౌభాగ్యం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షిస్తూ నవరాత్రి ఉత్సవాలు భక్తిమయ వాతావరణంలో కొనసాగుతున్నాయి. గణనాథుని నామస్మరణతో అన్నవరం ఆధ్యాత్మిక క్షేత్రం మరింత శోభాయమానంగా కనిపిస్తోంది.

## భూ రీసర్వే పై మంచాల గ్రామ రైతులకు అవగాహన

**మంత్రాలయం, సెప్టెంబర్ 22(మనం న్యూస్);** మండల కేంద్రమైన మంత్రాలయం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ఆదేశాలు మేరకు మంత్రాలయం తహశీల్దార్ రమాదేవి భూ రీ సర్వే పై గ్రామ రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచాల గ్రామ రైతు భూములను రిసర్వే చేయడం జరుగుతుందని రైతులు దానికి సంబంధించిన డాక్యుమెంట్లు , పాస్ పుస్తకాలు , పొలం ఎంజైమెంట్ , ఓల్ పాస్ బూక్ స్థానిక సర్వేయర్ కు అందించాలన్నారు. పొలం కొలిచే ముందు రీసర్వే అధికారులు రైతులకు రెండు రోజుల ముందే నోటీసులు అందిస్తారన్నారు.



అనంతరం పంచాయతీ కార్యాలయం నుండి రాఘవేంద్ర సర్కిల్ వరకు రిసర్వే పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ అశోక్ , గ్రామ సర్వేయర్ హేమచంద్ర , వీఆర్వో లు భీమన్న గౌడ్ , శోభ , రైతులు వెంకటేష్ నాగేష్ తిప్పయ్య నరసప్ప ఉరుకుంద సిపిఐ నాయకులు భాస్కర్ యాదవ్ లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

## ఐదేళ్లలో ఎన్నో సాధించాం.. ప్రజా సేవలో అంకితభావంతో పని చేశాం..

### జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర

### పదవి ఉన్నా లేకపోయినా ప్రజాసేవలోనే ఉంటామని ఉద్ఘాటన

### భావోద్వేగాల నడుమ సాగిన ఆఖరి సర్వసభ్య సమావేశం

### హాజరైన ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ



**విశాఖపట్నం, సెప్టెంబర్ 22:** విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్పర్సన్గా ఐదేళ్ల పాటు ప్రజలకు సేవలందించడం తనకు ఎంతో సంతృప్తిని, మధురమైన అనుభూతిని కలిగించిందని జెడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఈ ఐదేళ్లలో సమష్టిగా కలిసి ప్రజా సేవలో అంకితభావంతో పని చేశామన్నారు. 2021 సెప్టెంబర్ 24న తనతో పాటు జడ్పీటీసీ సభ్యులు, వైస్ చైర్మన్లు ఎన్నికై, ఐదేళ్ల పదవీకాలాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ ఆఖరి సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చరిత్ర కలిగిన విశాఖపట్నం జిల్లా పరిషత్లో జడ్పీటీసీ సభ్యులు, వైస్ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మూడు జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సభను నిర్వహించుకోవడం ఒక మంచి ఆనవాయితీగా కొనసాగిందని గుర్తు చేశారు. ఈ సమావేశం మన చివరిది కావడం కొంత బాధగా ఉన్నప్పటికీ, పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా జిల్లాల విభజన జరగడం సహజమైన ప్రక్రియ అని అన్నారు. జిల్లాలు విడిపోయినా ప్రజాసేవ విషయంలో మనమంతా కలిసే ఉంటామని సుభద్ర స్పష్టం చేశారు.

## నిత్యావసరాల ధరలు తగ్గించాలి



**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 22 మనం న్యూస్:** నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే నియంత్రించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని ఇప్టా గౌరవ అధ్యక్షుడు మామిడి దాన వరప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లిగూడెం ఇప్టా కార్యాలయంలో ప్రగతి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ యూనియన్ సమావేశం జరిగింది. కూటమి సర్కారు పాలనలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, 50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం ఇవ్వలేదని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ప్రజలకు ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని , ప్రజలను పట్టించుకోవట్లేదని , ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కూరగాయలు , బియ్యం , ఉల్లిపాయలు , నూనె , నిత్యవసర సరుకులు విపరీతంగా పెరిగిపోయాయని వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలని డిమాండ్ చేశారు.

## ప్రధాని మోడీకి విద్యార్థులు పోస్ట్ కార్డులు



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 22(మనం న్యూస్):** తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల , జూనియర్ కాలేజి లో బిజెపి ఎస్సీ మోర్చ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి వి ఆర్ వి ఎల్ నారాయణ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుపరిపాలన మరియు 76వ పుట్టినరోజు శుభాకాంక్షలు విద్యార్థులు పోస్టు కార్డుల ద్వారా తెలియచేశారు. ఈకార్యక్రమంలో ఆరుగోలను బిజెపి ఎస్సీ మోర్చ అధ్యక్షులు గాంధీ, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు , జిల్లా కార్యవర్గ సభ్యులు పాటే నాగేశ్వరరావు , గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దుర్గారావు సహకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు , ఉపాధ్యాయులు , బిజెపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెం అభివృద్ధి చెందుతుంది



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 22 మనం న్యూస్:** తాడేపల్లిగూడెం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.33 కోట్ల విలువైన పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ఈ పనులతో పట్టణ మౌలిక వసతులు మరింత మెరుగుపడనున్నాయి.అందులో భాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ నిర్వహించారు. ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు కల్పిస్తూ తాడేపల్లిగూడెం అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆచంటలో కొనసాగుతున్న వీఆర్ఏల నిరసన దీక్షలు

### వి ఆర్ ఏ లు అర్ధనగ్న ప్రదర్శన



**ఆచంట సెప్టెంబర్ 22 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ఆచంటలో ఏడవ రోజు వీఆర్ఏ ఉద్యోగులు మంగళవారం అర్ధనగ్న దీక్ష మరియు శాంతియుత నిరసన చేపట్టారు ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తలుపూరి ముత్యాలరావు సిరికొండ సాయి రామకృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వీఆర్ఏలకు వేతనాలు పెంచి ఇతర ప్రయోజనాలు కల్పించాలని అధికారం చేపట్టిన టిడిపి జనసేన బిజెపి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఒక ప్రక్క రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు మరో ప్రక్క తమ పిల్లల వైద్యం మరియు విద్య ఫీజులు తదితర ఖర్చులతో కుటుంబాలను పోషించుకునేందుకు నానా యాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు శాంతియుతంగా దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఇందుర్తి పెద్ద రెడ్డయ్య పద్మారావు సత్యనారాయణ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన జోకా శ్రీనివాస్



**కిర్లంపూడి, సెప్టెంబర్ 22(మనం న్యూస్):** కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన జోకా వెంకట శ్రీనివాస విజయకుమార్ జనసేన పార్టీలో చేరారు. పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి,జనసేన అధినేత పవన్కల్యాణ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. విజయకుమార్ 1969 నవంబరు 5న జన్మించారు. బీకాం,బీఎల్ పూర్తిచేసి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. 1995లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం కిర్లంపూడి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ కార్యదర్శిగా పనిచేశారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ మండల ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహించారు.రాజకీయాల తో పాటు న్యాయ, సామాజిక రంగాల్లోనూ ఆయన సేవలందించారు.బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఆరేళ్లు పనిచేశారు.ప్రస్తుతం కాకినాడ బార్ అసోసియేషన్లో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ విభాగాల కార్యదర్శిగా కొనసాగుతున్నారు.కరోనా సమయంలో 20 వేల మందికి ఉచితంగా కరోనా నిరోధక మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు.పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇప్పించడం,వికలాంగులు,వృద్ధులకు పెన్షన్లు,వైద్య సహాయం,ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా కృషి చేసినట్లు పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని జోకా శ్రీనివాస విజయకుమార్ తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు జనసేన బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.పార్టీలో ఎటువంటి పదవులు ఆశించకుండా పార్టీకి కట్టుబడి పనిచేస్తా అని తెలిపారు.

## అంగన్వాడీ భవనం ప్రారంభించిన ఎంపీపీ



**ఏలేశ్వరం,సెప్టెంబర్,22(మనం న్యూస్):** ఏలేశ్వరం మండలం మర్రివీడు పంచాయతీ పరిధిలోని పరిమితడకలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవనాన్ని మండల ప్రజా పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహారం,ఆరోగ్యం,పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చింతలపాటి బుజ్జిరాజు,నీలి సత్యనారాయణ, కొప్పిశెట్టి సూరిబాబు,ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వర్షంలోనూ తగ్గని జనసేన జోష్



### పిఠాపురం సభకు భారీ బైక్ ర్యాలీగా తరలిన జనసైనికులు

### ర్యాలీని ప్రారంభించిన జనసేన నేత గొర్లి నాగేశ్వరరావు

**శంఖవరం సెప్టెంబర్ 22 మనం ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిఠాపురంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు గ్రామం నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ సంప్రదింపుల కమిటీ సభ్యులు, కొంతంగి జనసేన పార్టీ అధ్యక్షుడు గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 500కు పైగా ద్విచక్ర వాహనాలతో జనసైనికులు పిఠాపురం సభకు జన ప్రదర్శనగా తరలి వెళ్ళి సభకు హాజరు అయ్యారు. కొంతంగి పంచాయతీ శివారు కొత్తూరులోని సచివాలం రావిచెట్టు కూడలి ప్రధాన రోడ్డులోని జనసేన పార్టీ జండా స్థూపం వద్ద పార్టీ జండాను ఊపి గొర్లె నాగేశ్వరరావు ఈ భారీ బైక్ ర్యాలీని ప్రారంభించారు.

కొంతంగి, కొత్తూరు, కత్తిపూడి గ్రామాల నుంచి నాగేశ్వరరావు అనుచర జన సైనికులు సమన్వయంతో బయలు దేరిన పిఠాపురానికి పయనించారు. దారిలో సుమారు 40 కిలోమీటర్ల దూరం పొడవునా గంట సమయం పాటు వర్షంలోనే తడుచుకుంటూ సభకు చేరుకున్నారు. పిఠాపురంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సభ నేపథ్యంలో కొంతంగి, కొత్తూరు గ్రామాల్లో జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పెద్ద సంఖ్యలో బైకులు, పార్టీ జెండాలతో జన సైనికులు తరలి రావడంతో పిఠాపురం వరకూ ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గొర్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ పిఠాపురంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బహిరంగ సభకు కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు తన ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలను తరలించినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో జనసైనికులు ఎల్లప్పుడూ ముందుంటారని అన్నారు.

కొంతంగి కొత్తూరు గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో జనసైనికులు స్వచ్ఛందంగా సభకు తరలివెళ్లడం పార్టీ పట్ల కార్యకర్తల్లో ఉన్న ఉత్సాహానికి నిదర్శనమని నాగేశ్వరరావు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంత పరిశీలన



**యు.కొత్తపల్లి సెప్టెంబర్ 22 ( మనం న్యూస్):** తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో యు.కొత్తపల్లి మండల తహసీల్దార్ చిన్నారావు కొత్తపట్నం నుంచి ఎస్పీజీఎల్ శివారు వరకు తీర ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, సముద్రంలో అలలు ఉధృతంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రస్తుతం వాతావరణం ప్రశాంతంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, గ్రామాల్లో అధికారులను ఇన్చార్జిలుగా ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన వారు వెంటనే సురక్షితంగా తీరానికి తిరిగి రావాలని తహసీల్దార్ సూచించారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్లలో

# ఎన్నడూ లేని అభివృద్ధి

### మంత్రి నిమ్మల రామానాయుడు



**పాలకొల్లు, సెప్టెంబర్ 23(మనం ప్రతినిధి):** వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయి అశాంతి, కక్షసాధింపులు, వేధింపులే కనిపించాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపిస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందని తెలిపారు. పాలకొల్లులో జరుగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధి పనులే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

పాలకొల్లులో లైన్స్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం హమ్ నిధులు రూ 43. 88 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శ్రీకారం చుట్టిన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసార సమావేశంలో కూటమి నాయకులతో కలిసి పాల్గొని మాట్లాడారు. పట్నంలోని అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే గతంలో ఎన్నడూ చూడని స్థాయిలో పాలకొల్లు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరు నాయుడు, బోనం చినబాబు, ఉన్నమట్ల కబడ్డీ, జక్కంపూడి కుమార్, ఎర్రంశెట్టి పద్మారావు, మహమ్మద్ జానీ, ముప్పిరి సత్యనారాయణ, పొట్నూరి శ్రీనివాస్, మీసాల రాము, ధనాన్ని సూర్యప్రకాష్, బేరం శ్రీరామచంద్రమూర్తి, కొల్లి కొండ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు ప్రభుత్వ పాలనపై పోరుకు సిద్ధం కావాలి: ముద్రగడ గిరిబాబు



**ఏలేశ్వరం, సెప్టెంబర్, 22:-(మనం న్యూస్):** కాకినాడ జిల్లా ఏలేశ్వరం వేదిక ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.వైసీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి బదిరెడ్డి గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి నియోజకవర్గ ఇంచార్జి ముద్రగడ గిరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.'వెన్నుపోటు ప్రభుత్వం.. వెన్నుపోటు పాలనపై పోరు' అనే నినాదంతో సమావేశాన్ని నిర్వహించారు.సమావేశం ప్రారంభానికి ముందు స్వర్గీయ ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఏలేశ్వరం మండలం భద్రవరం గ్రామ మాజీ సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు తన అనుచరులతో కలిసి జనసేన పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.సుమారు వందమంది ఆయన అనుచరులు వైసీపీలో చేరినట్లు పార్టీ నాయకులు తెలిపారు.వారికి నియోజకవర్గ సమన్వయకర్త ముద్రగడ గిరిబాబు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీ శ్రేణులకు సభ్యత్వ కార్డులను గిరిబాబు చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చలేదని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ల గడుస్తున్నా ఇప్పటివరకు కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలను మభ్యపెట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాలనను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన సమాధానం చెబుతారని గిరిబాబు అన్నారు.ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి జమీలు, జడ్పీటీసీలు బెహరా రాజేశ్వరి,గొల్లు చిన్న దివానం, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి,రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి అడపా సోమేశ్, శెట్టిబత్తుల కుమార్ రాజా,ఏలేశ్వరం టౌన్,రూరల్ ప్రత్తిపాడు, శంఖవరం మండల పార్టీ అధ్యక్షులు శిడగం వెంకటేశ్వరరావు,గొల్లపల్లి సురేష్,రామిశెట్టి నాని, నరాల శ్రీను,నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు పలివెల నాగేంద్ర,నాయకులు గొల్లపల్లి కాశీ విశ్వనాథ్,గొల్లపల్లి దొరబాబు,బీశెట్టి అప్పలరాజు, సుంకర రాంబాబు,సామంతుల సూర్యకుమార్, సకురు గుర్రాజు,గుడాల వెంకటరత్నం, గౌతు స్వామి,దళే చిట్టిబాబు, గొంతిరెడ్డి సతీష్,చిలకమర్తి వెంకటరమణ,ఓలేటి చంటిబాబు,దాడిశెట్టి చక్రధర్,యిజనగిరి శివ ప్రసాద్, బంక్ శ్రీను,గుమ్ములూరి వెంకటరమణ, సఖిరెడ్డి బుజ్జి, సోమరౌతు వివేక్,రామకుర్తి సత్యరాజా, పెయ్యల రాజా,సిరిపురపు రాజేష్,దత్తి రాజా, బీసెట్టి రాజా,బంటుపల్లి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.9.59 కోట్లతో నాగులపల్లి రక్షిత తాగునీటి పథకం ఆధునీకరణకు ప్రారంభోత్సవం





**యు.కొత్తపల్లి, సెప్టంబర్ 22(మనం న్యూస్):** యు.కొత్తపల్లి మండలం నాగులపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకం ఆధునీకరణ పనులకు మంగళవారం రాష్ట ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్కల్యాణ్ ప్రారంభించారు . రూ.9.59 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ఆధునీకరణ పనులతో మండలంలోని ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడనుంది. ముఖ్యంగా శివారు గ్రామాలకు సైతం నిరంతరాయంగా తాగునీరు అందేలా పథకాన్ని ఆధునీకరించరు అని జనసేన నాయకులు తెలుపుతున్నారు.పిఠాపురం నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా తాగునీటి సమస్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది.ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న పవన్కల్యాణ్ తాగునీటి సమస్య పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. నాగులపల్లి రక్షిత తాగునీటి పథకం ఆధునీకరణతో మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు తగ్గనున్నాయి.నాగులపల్లి రక్షిత మంచినీటి పథకంలో అవసరమైన ఆధునీకరణ పనులు చేపట్టి, నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. శివారు ప్రాంతాల్లోని గ్రామాలకు కూడా తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టడం ద్వారా వేసవిలో తాగునీటి కొరతను అధిగమించేందుకు అవకాశం ఏర్పడనుంది. 57 ఆవాసాలకు 97 వేల మంది ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులను నాణ్యతతో, నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన ఫైమెన్ కమిటీ సభ్యులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు రావు అక్షయ్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ చీఫ్ గాయత్రిదేవి, చీఫ్ ఇంజనీర్ హరి రామ్ నాయక్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులను పలకరించిన మంత్రి నారా లోకేష్

## మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా...



**ధర్మవరం సెప్టెంబర్ 22(మనం న్యూస్):** రాప్తాడు పర్యటన ముగించుకుని పుట్టపర్తి విమానాశ్రయానికి వెళ్తున్న మంత్రి నారా లోకేష్ ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద తన కాన్వాయ్ను నిలిపారు. పాఠశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులను చూసిన మంత్రి లోకేష్ వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడిన మంత్రి.. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యా బోధన తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు.విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని అధికారులను మంత్రి సూచించారు. మంత్రి అకస్మాత్తుగా పాఠశాల వద్ద ఆగి తమతో మాట్లాడటంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రజా సేవే లక్ష్యం.. దుర్గం అభివృద్ధే ధ్యేయం

**రూ.200.84 కోట్లతో అభివృద్ధి పనులు.. 32 వార్డుల్లో మౌలిక వసతుల కల్పన**

**ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు**

**ఇక్కడే సొంత ఇల్లు కట్టుకుంటా**



**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 22(మనం న్యూస్):** ప్రజలే దేవుళ్లుగా భావిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. కుటుంబ సభ్యులకు సమయం కేటాయించలేనంతగా ప్రజా సేవలో నిమగ్నమై ఉన్నానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం కళ్యాణదుర్గం పట్టణంలోని విద్యానగర్లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపాలిటీలోని 32 వార్డుల్లో మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి ఇంటికీ మంచినీరు అందించడంతో పాటు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, పైప్లైన్లు, సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు.

నియోజకవర్గానికి రూ.200.84 కోట్ల నిధులు తీసుకువచ్చామని, వాటితో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. రూ.19 కోట్లతో 8.5 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధి, రూ.2.40 కోట్లతో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాంప్లెక్స్ నిర్మాణంలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను పరిష్కరించి, గతంలో అక్కడ వ్యాపారాలు నిర్వహించిన వారికి అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో ఇప్పటికే నగరవనం ఏర్పాటు చేశామని, మరో రెండు పార్కులను రూ.1.44 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే అభివృద్ధి పనులు చేపట్టడం కాకుండా, నిరంతరం ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. మైనార్టీల కోసం రూ.50 లక్షల సొంత నిధులతో షాదీఖానాను అభివృద్ధి చేశామని, ఈద్గా మైదానాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఫైర్స్టేషన్కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రెస్క్లబ్కు స్థలం కేటాయించడంతో పాటు పెన్షనర్ల భవన్, యాదవ, పద్మశాలి, కనకదాస, వాల్మీకి భవనాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. బలిజ భవనానికి రూ.30 లక్షలు కేటాయిస్తున్నామని, వడ్డే కులస్తులకు భవనం, ఆధునిక సౌకర్యాలతో అంబేద్కర్ భవనం నిర్మిస్తామని తెలిపారు. ఏపీ డీసీసీబీకి సొంత భవనం నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల రాక

- **జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



**అనంతపురం, కలెక్టరేట్ సెప్టెంబర్ 22(మనం న్యూస్):** ఈనెల 23, 24వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (అప్స్సీపీసీర్ ) సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు, చల్లా మధుసూదన్ రావు జిల్లా పర్యటనకు రానున్నారని తెలిపారు. ఈనెల 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఐసిడిఎస్ కేంద్రాలు, కేజీబీవీలు మరియు సిసిఐలను తనిఖీలు చేస్తారు. మధ్యాహ్నం 01:30 గంటల నుంచి 02:00 గంటల వరకు ఎన్జీవోలతో ఇంటరాక్ట్ అవుతారు. మధ్యాహ్నం 02:00 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్లను తనిఖీ చేస్తారు మరియు ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రికి వారు జిల్లాలో బస చేస్తారు. ఈనెల 24వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు జిల్లాలో ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం 02:00 గంటల నుంచి సాయంత్రం 05:00 గంటల వరకు అనంతపురం కలెక్టరేట్ లో ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, జువైనల్ జస్టిస్ బోర్డ్, ఫుడ్ సేఫ్టీ, డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఓ, డిఐఈఓ, పిడి ఎస్ఎస్ఏ, రెవెన్యూ శాఖ, పిఆర్డీ, ఎంఎయుడి, విద్యాశాఖ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, లేబర్, విలేజ్ / వార్డు చైల్ మ్యారేజ్ ప్రివెన్షన్ మైనార్టీ కమిటీ, పోలీస్, ఆర్టీవో రూరల్, వాటర్ సప్లై, మున్సిపల్, పంచాయతీరాజ్, తదితర శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం 05:30 గంటలకు అనంతపురం జిల్లా నుంచి బయలుదేరి అన్నమయ్య జిల్లాకు వెళతారు.

# కదిరి పట్టణ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**పట్టణ అభివృద్ధికి రూ.29 కోట్ల ఎచ్ ఏఎం నిధులు**

**కుప్పం నుంచి మున్సిపల్ ఎచ్ ఏఎం ప్రాజెక్టులకు వర్చువల్ శ్రీకారం చుట్టిన సీఎం**



**కదిరి,సెప్టెంబర్ 22(మనంన్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల అభివృద్ధికి చేపట్టనున్న ఎచ్ ఏ ఎం ప్రాజెక్టుల వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కదిరి పట్టణంలోని గరల్స్ కాలేజ్ ఎదురుగా ఉన్న తాయి గ్రాండ్లో కదిరి పట్టణ అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో పాల్గొని ప్రసంగించారు.

కదిరి మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి ఎన్నడూ లేని విధంగా దాదాపు రూ.29 కోట్ల ఎచ్ ఏఎం నిధులతో కదిరి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నామని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**అభివృద్ధే కూటమి ప్రభుత్వానికి రాజకీయ సమాధానం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గారు మాట్లాడుతూ, కదిరి పట్టణానికి దాదాపు రూ.29 కోట్లఎచ్ ఏఎం నిధులు తీసుకురావడం మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనులతో ప్రజలకు సమాధానం చెప్పే కూటమి ప్రభుత్వ విధానానికి నిదర్శనం అని అన్నారు. గతంలో అధికారంలో ఉన్నవారు అభివృద్ధి గురించి ఎన్ని మాటలు చెప్పినా ప్రజల ముందున్న వాస్తవం ఏమిటో ప్రజలే గమనించారు. ఇప్పుడు కదిరి పట్టణానికి భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నాం. ప్రజలకు కావాల్సింది రాజకీయ విమర్శలు కాదు.. అభివృద్ధి, మౌలిక వసతులు, సంక్షేమం. కూటమి ప్రభుత్వం ఆ దిశగా పనిచేస్తోంది అని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

సీటు ఎవరికి వచ్చినా అభ్యర్థి ఒక్కరే కాదు.. కూటమి అభ్యర్థి. వ్యక్తిగత అభిప్రాయాలను పక్కన పెట్టి టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి అని అన్నారు. వైసీపీకి కదిరిలో రాజకీయంగా ప్రజల నుంచి మద్దతు లేదని, గత ఎన్నికల ఫలితాల తర్వాత కూడా ప్రజల తీర్పు స్పష్టంగా ఉందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి నాయకులు సమష్టిగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని ఆయన అన్నారు.

వైసీపీ రాజకీయాలకు ప్రజలు స్వస్తి చెప్పి అభివృద్ధి వైపు చూస్తున్నారు. కదిరి అభివృద్ధి కోసం ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు కేవలం రాజకీయాలు చేస్తున్నారో ప్రజలే నిర్ణయిస్తారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధే మా సమాధానం అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గారు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా కదిరి నియోజకవర్గంలో కూడా అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# గుంతకల్లునుమోడల్ సిటీగా చేస్తా

## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు, సెప్టెంబర్ 22(మనం న్యూస్):** గుంతకల్ పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం 39 కోట్ల నిధులతోఅభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు కూడలి వద్ద ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా అయినప్పటి నుంచి ఇప్పటివరకు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానని ఇందులో భాగంగా గుంతకల్లు పట్టణాన్ని మోడల్ సిటీగా మారుస్తానన్నారు అందుగ్గాను 39 కోట్ల నిధులను పట్టణ అభివృద్ధికి కేటాయించారు. పట్టణాన్ని ఎన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోతామన్నారు అర్బన్ చాలెంజ్ పండు ద్వారా 39 కోట్లనిధులు పట్టణ అభివృద్ధికి కేటాయిస్తామన్నారు. పట్టణములో ఇంటింటికి నీటి కొలువైన ఏర్పాటు చేస్తున్నామని. మురికి కాలువల వ్యవస్థను మరింత విస్తరిస్తామన్నారు సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని ముఖ్యంగా కొన్ని కోడలు నూతన రోడ్డు పనులు కూడా జరుగుతున్నాయన్నారు. పట్టణాన్ని అత్యంత అందంగా వీధి దీపాలతో అలంకరించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, మునిసిపల్ కమిషనర్ లక్ష్మీదేవి, డిప్యూటీ డి ఈ నీలంహరికృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన జర్మనీకి పరిశోధకులు

## బత్తలపల్లి మండలంలో కేఎఫ్డబ్ల్యూ పరిశోధకుల క్షేత్ర సందర్శన



**బత్తలపల్లి, సెప్టెంబర్ 22(మనం న్యూస్):** జర్మనీకి చెందిన కేఎఫ్డబ్ల్యూ పరిశోధకుల బృందం శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. మంగళవారం కేఎఫ్డబ్ల్యూ సెక్టార్ ఎకనామిస్ట్ ఐరిస్ హార్డర్, కేఎఫ్డబ్ల్యూ న్యూఢిల్లీ సీనియర్ ఎన్ఆర్ఎం స్పెషలిస్ట్ సంగీత అగర్వాల్, రైస్ఎస్ సీనియర్ కన్సల్టెంట్ జి. మురళి, సీటీ అండ్ ఐఒ, డీపీఎం లక్ష్మానాయక్, ఎస్టీఎల్ జలాల్ బాషా ఉద్దీన్ బాషా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రవు) బృందం ఈ పర్యటనలో పాల్గొన్నారు. నేత్తివారంపల్లి గ్రామంలో పరిశోధనా ప్రదేశాన్ని బృందం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వేరుశనగ సాగు చేస్తున్న నారాయణస్వామి, రసాయన వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న గంగరాజుతో బృంద సభ్యులు మాట్లాడి సాగు విధానాలు, పంట నిర్వహణ, పెట్టుబడులు, దిగుబడులు తదితర అంశాలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయం మరియు రసాయన వ్యవసాయ విధానాలపై రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం బృందం ఉప్పరపల్లి గ్రామంలోని మస్సర్ఫ్ పరిశోధనా ప్రదేశాన్ని సందర్శించింది. అక్కడ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగు చేస్తున్న దివాకర్, రసాయన వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న ఒబన్నతో పరస్పరం మాట్లాడింది. సాగులో ఎదురవుతున్న సమస్యలు, అనుసరిస్తున్న పద్ధతులు, పంటల నిర్వహణ తదితర అంశాలపై రైతుల నుంచి వివరాలు సేకరించింది. ఈ సందర్భంగా బృందంతో కలిసి పరిశోధనా క్షేత్రాల్లో చేపడుతున్న అధ్యయనాలు, రైతుల అనుభవాలు, ప్రకృతి వ్యవసాయ విధానాలపై క్షేత్రస్థాయి పరిశీలనలు చేశారు.

# వాల్మీకి వరసిద్ధి వినాయకునికి విశేష పూజలు

## ప్రత్యేక పూజలో మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి వైసీపీ శ్రేణులు



**మడకశిర, సెప్టెంబర్ 22(మనం న్యూస్):** మడకశిర పట్టణంలోని వాల్మీకి వరసిద్ధి వినాయకుడికి మంగళవారం విశేషపూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి శ్రీ విగ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు జరిపించారు. మహా మంగళ హారతి, తీర్థప్రసాదం స్వీకరించారు. మడకశిర పట్టణంలోని వాల్మీకి సర్కిల్లో వాల్మీకి వరసిద్ధి వినాయక సేవా సంఘం ఆహ్వానం మేరకు వారు గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

అనంతరం వాల్మీకి వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యేతో పాటు, వైసీపీ శ్రేణులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్ఇసి సభ్యుడు వైసీ గోవర్ధన్ రెడ్డి,మడకశిర నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి ఈరలక్కప్ప, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సంయుక్త కార్యదర్శి జయరామ్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నాగరాజ్ గౌడ్, పట్టణ ఉపాధ్యక్షుడు గోపి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధను, పట్టణ ప్రచార విభాగం అధ్యక్షుడు రఘునందన్, పట్టణ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ రెడ్డి గౌడనాహళ్లి మాజీ సర్పంచ్ హనుమంతే గౌడ్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు వాల్మీకి మోహన్ కుమార్, వాల్మీకి సంఘం కమిటీ సభ్యులు కుళ్లాయప్ప, ఓబులేశు, మాదవరాజు, నాగరాజు, రాధాకృష్ణ,కదిరి నరసింహులు పట్టణ సీనియర్ నాయకులు సూరంగాల నాగరాజు,చంద్ర నరసింహప్ప సుధా అన్వేష్, నవీన్ తదితరులు భక్తులు పాల్గొన్నారు.



# శ్రేష్ఠ నాన్ లోకల్ సమస్యపై నేరుగా సీఎం దృష్టికి

- **ఎస్సి కమీషన్ చైర్మన్ జవహర్ హామీ**

**కర్నూలు, సెప్టెంబర్ 22 మనం న్యూస్:** గత రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రేష్ఠ పథకం ద్వారా ఎంపికై వివిధ రాష్ట్రాల లో 9 వ తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు చదువు తున్న విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జీవో నెంబర్ 20 వల్ల నాన్ లోకల్ గా పరిగణించబడుతున్నారు. దీంతో ఉన్నత చదువులకు దూరం అవుతున్నారు. ఎస్సి రిజర్వేషన్ కోల్పోతున్నారు అని శ్రేష్ఠ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ లో ఎస్సి కమీషన్ కార్యాలయంలో చైర్మన్ జవహర్ గారిని శ్రేష్ఠ విద్యార్థుల ఉన్నత విద్య ప్రవేశాల లో లోకల్ సమస్య తో సతమతమవుతున్నారు అని తెలిపారు. ఇందుకు స్పందించిన చైర్మన్ జవహర్ సార్ ఈ సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అపాయింట్ మెంట్ తీసుకుని పేద విద్యార్థులకు న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ నరసింహ రాజు శ్రేష్ఠ విద్యార్థుల తల్లిదండ్రులు భీమన్న బడ్డేటి కిరణ్ బాబు సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు

# పుట్టపర్తి విమానాశ్రయంలో నారా లోకేష్కు టీడీపీ శ్రేణుల స్వాగతం

**రాప్తాడులో పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు**



**పుట్టపర్తి, సెప్టెంబర్ 22 మనం న్యూస్:** రాప్తాడు నియోజకవర్గంలోని రాప్తాడు మండల కేంద్రంలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాల ఆవిష్కరణతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లాకు చెందిన టీడీపీ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. ఉదయం 8.45 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న నారా లోకేష్కు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, టీడీపీ జోనల్ ఇన్చార్జ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత, హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, ఎమ్మెల్యేలు ఎం.ఎస్. రాజు, దగ్గుపాటి వెంకట ప్రసాద్, కందికుంట ప్రసాద్, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణి, ఎమ్మెల్సీ రమాదేవి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, గుండుమల తిప్పేస్వామి, అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి చేరుకోవడంతో పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. అనంతరం మంత్రి నారా లోకేష్ రాప్తాడు మండల కేంద్రానికి వెళ్లి ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

## ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం, కలెక్టరేట్ సెప్టెంబర్ 22 :** ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాక్ బుక్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ల వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని, ఏ ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, వైఎస్ఆర్సిపి ప్రతినిధి శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ ప్రతినిధి మసూద్ వలి, కాంగ్రెస్ ప్రతినిధి ఇమామ్, సిపిఐ(ఎం) ప్రతినిధి రామాంజనేయులు, బిజెపి శ్యామ్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.




## సినీ పరిశ్రమకు శుభవార్త.. త్వరలోనే నంది అవార్డుల ప్రకటన

తెలుగు సినీ పరిశ్రమకు ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రతిష్ఠాత్మక నంది అవార్డులను త్వరలోనే ప్రదానం చేయనున్నట్లు ప్రకటించింది. తెలుగు సినీ రంగంలో నంది అవార్డులకు ప్రత్యేక స్థానం ఉంది. నటీనటుల ప్రతిభకు తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందించేందుకు ఇచ్చే ఈ అవార్డును గొప్పగా భావిస్తారు. గత కొన్నేళ్లుగా ఆగిపోయిన నంది అవార్డులను ఇవ్వనున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేశ్ ప్రకటించారు. ఈ మేరకు వివరాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ భరత్ భూషణ్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

### ఆ కాలానికి ఏడాది నాలుగు అవార్డులే..

''ఆగిపోయిన నంది అవార్డులను మళ్లీ మొదలు పెడుతున్నాం. దీనివెనుక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే బాలకృష్ణ సహా పలువురు కృషి ఉంది. 2012 నుంచి 2016 వరకూ అవార్డులను ప్రకటించారు. కానీ, కార్యక్రమం నిర్వహించలేదు. ఆ కాలానికి సినీ పరిశ్రమకు సంబంధించి 288 అవార్డులు, 51 జ్యూరీ అవార్డులు ఇవ్వాల్సి ఉంది. అలాగే, టెలివిజన్ రంగంలో 330 అవార్డులు, 54 జ్యూరీ అవార్డులు అందజేయాలి. ఇప్పటివరకూ ప్రకటించిన అవార్డులన్నీ ఇస్తాం. 2017-2024 వరకూ అవార్డులను ప్రకటించలేదు. కానీ, ఆ సమయంలో విడుదలైన సినిమాలను ప్రోత్సహించడానికి మా వంతు కృషి చేస్తున్నాం. ఆ సంవత్సరాల్లో ఏటా 4 అవార్డులు చొప్పున ఇస్తాం. ఉత్తమ చిత్రం, ఉత్తమ ద్వితీయ చిత్రం, సహా రెండు స్పెషల్ జ్యూరీ అవార్డులు ఇస్తాం. అన్ని కేటగిరిల్లో అవార్డులు ఇవ్వడం ఆచరణ సాధ్యంకాదు. 2025 నుంచి అన్ని విభాగాల్లోనూ అవార్డులు అందజేస్తాం''

### గద్దర్ అవార్డులతో దీనికి సంబంధం లేదు

''తెలుగు సినిమా ఎక్కడున్నా ఒకటే. తెలంగాణలో గద్దర్ అవార్డులు తీసుకున్న చిత్రాలు కూడా ఇక్కడ దరఖాస్తు చేసుకోవచ్చు. దానికి దీనికీ సంబంధం లేదు. తెలుగు సినిమా అయితే చాలు. నగదు ప్రోత్సాహకం కూడా ఉంటుంది. ఏ అవార్డుకు ఎంత? అనేది జీవో ద్వారా వెల్లడిస్తాం. ఫిల్మ్ నంది అవార్డుల వేడుక అమరావతిలో నిర్వహిస్తాం. అలాగే, టెలివిజన్ అవార్డుల ప్రదానం తిరుపతిలో చేయాలని అనుకుంటున్నాం. 2025 సంవత్సరానికి సంబంధించి అన్ని కేటగిరీలకు ఈ రోజు నోటిఫికేషన్ ఇస్తున్నాం. అక్టోబరు 12లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెండో వారంలో జ్యూరీని, అవార్డులను ప్రకటిస్తాం. వీలైనంత త్వరగా అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది. ఏపీలో షూటింగ్స్ జరుపుకొనే సినిమాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తగిన ప్రోత్సాహం ఉంటుంది. షూటింగ్ అనుమతుల కోసం సింగిల్ విండో పద్ధతి పాటిస్తున్నాం. ప్రస్తుతం రాష్ట్రంలో సినిమా షూటింగ్ లకు అనువైన ప్రదేశాల జాబితాను సిద్ధం చేశాం. ఇప్పటికే 13 సినిమాలు చిత్రీకరణ జరుపుకొంటున్నాయి'' అని భరత్ భూషణ్ వెల్లడించారు.

## మొట్టమొదటిసారి పౌరాణిక పాత్రలో రాఘవ లారెన్స్



డైరెక్టర్ రమేష్ వర్మ తెరకెక్కిస్తున్న పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'మహావీర్ కర్ణ'. ఈ భారీ చిత్రంలో రాఘవ లారెన్స్ కర్ణుడి పాత్రలో నటిస్తున్నారు. తాజాగా మేకర్స్ విడుదల చేసిన లారెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ 'పెన్ మూవీస్' ఈ పోస్టర్ను షేర్ చేస్తూ.. ఒక ముఖం, ఒక లెజెండ్, ఒక యోధుడు అంటూ అంచనాలను పెంచేశారు. ఇక ఈ విషయంపై రాఘవ లారెన్స్ స్పందిస్తూ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తన కెరీర్లో ఫస్ట్ టైమ్ పురాణ పాత్రలో నటిస్తున్న లారెన్స్.. ఈ ప్రాజెక్ట్ గురించి స్పందిస్తూ.. 'మన పురాణాల్లోని అత్యంత శక్తివంతమైన, లెజెండరీ పాత్ర అయిన కర్ణుడి పాత్రలో నటించడం నాకు దక్కిన గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఈ స్క్రిప్ట్ నా దగ్గరకు వస్తుందని నేను అసలు ఊహించలేదు. ఈ అద్భుతమైన అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రమేష్ వర్మకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఎంతో వినయంతో, కృతజ్ఞతా భావంతో ఈ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాను. మీ అందరి ఆశీస్సులు, సపోర్ట్ నాకు ఎప్పుడూ ఉండాలి' అంటూ లారెన్స్ రాసుకొచ్చారు.

గౌరవం, విధి, విధేయత, త్యాగానికి ప్రతిరూపమైన యోధుడు కర్ణుడి పాత్రలో లారెన్స్ లుక్ అద్భుతంగా ఉందని నెట్టింట సినీ ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. కాగా.. పెన్ మూవీస్ జయంతిలాల గడా, ఆర్వీ స్టూడియోస్, శ్రీ నీలాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాను దాదాపు 150 కోట్ల భారీ బడ్జెట్తో ఐదు భాషల్లో తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ తెరకెక్కిస్తున్నారు. భారీ సెట్లు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, గూస్బంప్స్ తెప్పించే యాక్షన్ సీక్వెన్సులతో ఈ సినిమాను ఒక విజువల్ వండర్గా మలుస్తున్నారట మేకర్స్. రాఘవ లారెన్స్ లీడ్ రోల్లో వస్తున్న ఈ ఎపిక్ యాక్షన్ సాగా వచ్చే ఏడాది ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా థియేటర్లలో విడుదల కాబోతుంది.




## క్రికెట్‌తోనే భారత్‌కు తొలి స్వర్ణం..

### ఫైనల్‌లో శ్రీలంకపై ఘన విజయం

ఆసియా క్రీడల్లో భారత్ కు తొలి స్వర్ణ పతకం లభించింది. మహిళల క్రికెట్ ఫైనల్లో హర్మన్ ప్రీత్ సేన అద్భుత విజయంతో పసిడిని సొంతం చేసుకుంది. తుది పోరులో శ్రీలంకపై 147 పరుగుల తేడాతో టీమ్ఇండియా గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 216/3 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో శ్రీలంక 69 రన్స్కు ఆలౌటైంది. దీంతో శ్రీలంక రజతంతో సరిపెట్టుకుంది. అంతకుముందు జరిగిన కాంస్య పోరులో బంగ్లాదేశ్ పై పాకిస్థాన్ విజయం సాధించింది.

#### బౌలర్ల దెబ్బకు..

భారత్ నిర్దేశించిన భారీ లక్ష్య ఛేదనకు దిగిన శ్రీలంకకు ఏదీ కలిసిరాలేదు. టీమ్ఇండియా బౌలర్ల దెబ్బకు బెంబేలెత్తిపోయారు. ఓ వైపు ఆ జట్టు సారథి చమరి ఆటపట్టు (29) ఒంటరి పోరాటం చేసింది. ఆమెనే శ్రీలంక తరపున టాప్ స్కోరర్. దీప్తి శర్మ (3/6), షఫాలీ వర్మ (2/3) శ్రీ చరణి (2/13), శ్రేయాంక పాటిల్ (2/9) దెబ్బకు శ్రీలంక ఏ దశలోనూ పోటీలో లేదు. ఇమేషా దులాని (3), హాసిని (0), కవిష దిల్హారి (11), హర్షిత (0), కౌషని (14), హన్సిమ (1), సుగందిక (3) పరుగులు చేశారు.

#### బ్యాటింగ్ లో మెరుపులు

శ్రీలంకపై ఇప్పటికే ఆసియా కప్లో గెలిచి ఊపుమీదున్న టీమ్ఇండియా.. ఈ ఫైనల్లోనూ అదే జోరు చూపించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యం ఉంచింది. షఫాలీ వర్మ (48: 29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు)తో కలిసి ఓపెనర్ స్మృతి మంధాన (79: 45 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సులు) తొలి వికెట్కు 99 పరుగులు జోడించింది. ఈ క్రమంలో ఒకే క్యాలెండర్ ఇయర్లో అత్యధిక టీ20 పరుగులు చేసిన బ్యాటర్గా మంధాన ఘనత సాధించింది. షఫాలీ హాఫ్ సెంచరీ ముంగిట ఔటైంది. అయితే, ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (19)తో మంధాన ఇన్నింగ్స్ను నడిపించింది. స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ పెవిలియన్కు చేరినా.. రిచా ఘోష్ (49₹: 22 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు) మాత్రం ఎదురు దాడి చేసింది. ఓవైపు భారతి (7₹)ను నాన్స్ట్రైకింగ్కు పరిమితం చేసిన రిచా.. ఆఖరి మూడు ఓవర్లలో భారత్కు యాభై పరుగులను అందించింది. శ్రీలంక బౌలర్లలో సుగందిక, కవిష, ప్రబోద తలో వికెట్ తీశారు.

### జపాన్‌తో చారిత్రక మ్యాచ్..

## భారత్‌దే విజయం

ఆసియా క్రీడల్లో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగబోతున్న టీమ్ఇండియా.. అంతకంటే ముందే విజయాల బోణీ కొట్టింది. ఆసియా క్రీడల ఆతిథ్య దేశం జపాన్తో జరిగిన చారిత్రక తొలి టీ20 మ్యాచ్లో భారత్ విజయం సాధించింది. వర్షం కారణంగా 5 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్లో.. జపాన్తో టీమ్ఇండియా 2 పరుగుల తేడాతో గెలుపొందింది.

ఈ మ్యాచ్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. నిర్ణీత ఐదు ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 32 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ మరోసారి డకౌట్ అయ్యాడు.




సంజూశాంసన్ (9), ఇషాన్ కిషన్ (3) కూడా విఫలమయ్యారు. శ్రేయస్ అయ్యర్ (16) ఫర్వాలేదనిపించాడు. జపాన్ బౌలర్లలో ఛార్లీ హరా-హింజే రెండు వికెట్లు తీయగా.. ఇబ్రహిం తకహషి, బెంజమిన్ ఇతో-డేవిస్ చెరో వికెట్ తీసుకున్నారు. లక్ష్య ఛేదనలో జపాన్ గట్టిపోటీ ఇచ్చింది. అయితే, నిర్ణీత ఓవర్లలో ఆ జట్టు మూడు వికెట్ల నష్టానికి 30 పరుగులకే పరిమితమైంది. జపాన్ బ్యాటర్లలో కెండెల్ కడోవాకి-ఫ్లెమింగ్ (12), జెంజమిన్ ఇతో డేవిస్ (9) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ రెండు వికెట్లు తీశాడు. ఓపెనర్ లఛ్లాన్ యమమోటో లేక్ రనౌట్ అయ్యాడు.

## డబ్బు కంటే మానసిక ప్రశాంతతే విలువైనది: ఐశ్వర్యలక్ష్మి



కోలీవుడ్ బ్యూటీ ఐశ్వర్యలక్ష్మి తీసుకున్న ఒక సంచలన నిర్ణయం ఇండస్ట్రీలో హాట్ టాపిక్గా మారింది. కెరీర్ పరంగా దూసుకుపోతున్న ఈ సమయంలో ఆమె సోషల్ మీడియాకు పూర్తిగా గుడ్బై చెప్పడం వెనుక ఉన్న అసలు కారణాలను బయటపెట్టారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో భాగంగా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఏదో కొద్దిరోజులు గ్యాప్ ఇద్దామని ఈ నిర్ణయం తీసుకోలేదని ఆమె స్పష్టం చేశారు. నేడు విపరీతంగా పెరిగిపోయిన ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని కొందరు ఎంత నీచంగా వాడుకుంటున్నారో చూసి తాను తీవ్రంగా విసిగిపోయినట్లు తెలిపారు. ముఖ్యంగా సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ ఏఐ ద్వారా అసభ్యకరంగా ఫొటోలు, వీడియోలను ఎడిట్ చేసి పోస్ట్ చేస్తున్న సంస్కృతిని చూశాక.. తనకు ఆ నెట్వర్క్ మీద అసహ్యం వేసిందని వాపోయారు. ఈ డిజిటల్ పిచ్చికి దూరంగా ఉండటం వల్లే తన రియల్ లైఫ్లో అసలైన స్వేచ్ఛ దొరికిందని ఐశ్వర్యలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు.

అయితే ఈ నిర్ణయం వల్ల ఆర్థికంగా భారీ నష్టం తప్పదని ఆమె మేనేజర్ స్వయంగా హెచ్చరించినట్లు తెలిపారు. 'దయచేసి మీ సోషల్ మీడియా అకౌంట్స్ మళ్లీ ఓపెన్ చేయండి.. లేదంటే బ్రాండ్స్, ప్రమోషన్స్ కోల్పోయి బోలెడు డబ్బు నష్టపోతారు' అని మేనేజర్ చెప్పినట్లు గుర్తుచేసుకున్నారు. కానీ, కోట్ల రూపాయల కంటే తనకు దొరికిన ఈ మానసిక ప్రశాంతతే వేల రెట్లు విలువైనదని తాను భావించినట్లు స్పష్టం చేశారు. గతంలో సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్, నెగెటివ్ కామెంట్లు తన మనసుపై తీవ్ర ప్రభావం చూపాయని ఐశ్వర్యలక్ష్మి ఎమోషనల్ అయ్యారు. ఆ కామెంట్లు రోజూ చదవడం వల్ల ఈ ప్రపంచమంతా తనకే వ్యతిరేకంగా ఉందనే భ్రమ కలిగేదని, అసలు తనను ఇష్టపడేవారే లేరనే డిప్రెషన్లోకి వెళ్లిపోయినట్లు ఆమె వెల్లడించారు.

ఫ్రూట్ లీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న మరోసారి తెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారు. వీరిద్దరి కాంబినేషన్లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రణబాలి'. టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల కాబోతోంది. ఈనేపథ్యంలో.. తాజాగా, మేకర్స్ మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ ఫస్ట్ సింగిల్ను అధికారికంగా రిలీజ్ చేశారు. సరిగ్గా ఆరు నెలల క్రితం సోషల్ మీడియాలో చిన్న బీట్గా వచ్చి విపరీతమైన సెన్సేషన్ క్రియేట్ చేసిన 'ఏందయ్య సామీ' పూర్తి పాటను ఇప్పుడు విడుదల చేయడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## రణబాలి మ్యూజికల్ జర్నీ షురూ..

తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సాంగ్ వీడియోను ఒకేసారి రిలీజ్ చేశారు. 'రణబాలి, జయమ్మ ప్రపంచంతో ప్రేమలో పడిపోతారు' అంటూ మేకర్స్ పెట్టిన క్యాప్షన్ సాంగ్ క్యూరియాసిటీని మరింత పెంచేసింది. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుల ద్వయం అజయ్-అతుల్ అందించిన మ్యూజిక్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పల్లెటూరి స్వచ్ఛమైన జానపద శైలిని, ఆధునిక మెలోడీ స్వరాలను అద్భుతంగా మిక్స్ చేసి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. విజయ్ దేవరకొండ, రష్మికల కెమిస్ట్రీ ఈ పాటకు మరింత ప్లస్ అయింది. ప్రస్తుతం సోషల్ మీడియా లో ట్రెండింగ్లో దూసుకుపోతోంది. ఇక ఇది చూసిన నెటిజన్లు కెమిస్ట్రీ అదుర్స్ అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.





## నాపై అలాంటి విమర్శలు చేయడం మూర్ఖత్వమే అవుతుంది.. : చిరంజీవి

మెగాస్టార్ చిరంజీవిపై గత కొంతకాలంగా కొందరు పనిగట్టుకుని నెగెటివిటీని స్ప్రెడ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆయన ఎంతో నిస్వార్థంగా నడిపిస్తున్న బ్లడ్ బ్యాంక్ పై కొందరు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తూ, అక్కడి రక్తాన్ని అమ్ముకుంటున్నారంటూ దారుణమైన ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా ఇండస్ట్రీకి వచ్చి 48 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన మెగా యూత్ ఫోర్స్ ఫ్యాన్స్ మీట్ లో పాల్గొన్న చిరంజీవి.. ఈ ఆరోపణలపై స్పందిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన జీవితంలో ఎన్నో అవమానాలు, విమర్శలు ఎదుర్కొన్నానని చెప్పిన మెగాస్టార్.. బ్లడ్ బ్యాంక్ పై వస్తున్న విమర్శలు పూర్తిగా అర్థరహితమని కొట్టిపారేశారు.

తాను సినిమాల్లో తీసుకునే భారీ పారితోషికంతో సమానమైన డబ్బులను రక్తం అమ్మడం ద్వారా సంపాదించాలంటే.. అసలు ఎన్ని కోట్ల రక్తం ప్యాకెట్లు విక్రయించాల్సి వస్తుందో ఆ విమర్శలు చేసేవారికి బుద్ధి ఉందా అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఎవరి దగ్గరా ఎలాంటి డొనేషన్లు తీసుకోకుండా కేవలం తన కష్టార్జితంతోనే ఈ బ్లడ్ బ్యాంక్ ను ఎంతో పవిత్రంగా నడిపిస్తున్నానని చిరంజీవి స్పష్టం చేశారు. అలాంటి సేవా కార్యక్రమంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం కేవలం మూర్ఖత్వమేనని, అందుకే అలాంటి పనికిమాలిన విమర్శలను తాను ఎప్పుడూ పట్టించుకోనని తేల్చిచెప్పారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.